ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 205

బుధవారం 29 జనవరి 2025 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD


ఇంగ్లాండ్‌తో మూడో టీ20లో..

## టీమ్ఇండియా ఓటమి



.. వివరాలు 7లో



# వన్ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం

## తెలంగాణకు భారీగా పెట్టుబడులు

### దావోస్ ఒప్పందాలతో 1.80లక్షల కోట్లు

- స్కిల్ వర్సిటీ కోసం సింగపూర్‌తో ఒప్పందం
- పెట్టుబడులపై కొందరు వక్రభాష్యాలు
- రాష్ట్ర అభివృద్ధిపై దుష్ప్రచారాలు చేస్తున్నారు
- మంత్రులతో కలసి సీఎం మీడియా సమావేశం

**హైదరాబాద్, రోమింగ్‌న్యూస్:** తమ ప్రభుత్వం సాధించిన విజయాల్లో దావోస్ ఒప్పందాల సాధన అతి పెద్దదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దావోస్ సదస్సు ద్వారా దాదాపు రూ. 1.80లక్షల కోట్ల పెట్టుబడులు సాధించినట్టు చెప్పారు. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. అయితే కొందరు దీనిని జీర్ణించుకోలేక వెకిలి వ్యాఖ్యలు చేస్తున్నారని సిఎం మండిపడ్డారు. సచివాయలంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిఎం ర ఏవంత్ రెడ్డి, మంత్రులు మాట్లాడారు. ప్రభుత్వంపై కొందరు చేసిన దుష్ప్రచారం పటాపంచలు అయ్యింది. ప్రభుత్వంపై, రాష్ట్రంపై నమ్మకం ఉంచుతూ భారీ పెట్టుబడులకు చాలామంది ముందుకు వచ్చారు. ఈ ప్రభుత్వంపై విశ్వాసం ఉంచుతూ అంతర్జాతీయ సంస్థలు భారీ పెట్టుబడులు పెడుతున్నాయని సీఎం వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని మిగతా 2 లో

## ఎకో టూరిజం అభివృద్ధికి కృషి

- టెంపుల్ టూరిజం పట్ల నిర్లక్ష్యం వహించారు
- కో ఫ్రెండ్లీ ఎక్స్‌పీరియం పార్కును ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- ఇది సినిమా షూటింగ్‌లకు అద్భుతమని చెప్పిన నటుడు చిరంజీవి

02



# కేసీఆర్ ఎప్పుడో చెప్పారు

కాంగ్రెస్ వస్తే రైతుబంధుకు రాంరాం చెబుతారని..

- కేసీఆర్ ప్రభుత్వం రూ.73 వేల కోట్ల రైతుబంధు ఇచ్చింది
- మోసం చేయడాన్ని కూడా చారిత్రాత్మకం అంటారేమో!
- నల్గొండ రైతు మహాధర్నాలో కేటీఆర్ చురకలు



03

ఆనాడు నిజాం సర్కారును నిలదీసిన గడ్డ నల్గొండ అని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఈ జిల్లాకు మాజీ సీఎం కేసీఆర్ ఏం చేశారని అసెంబ్లీలో ఓ మంత్రి అడిగారన్న ఆయన.. వరి ఉత్పత్తిలో జిల్లాను నెంబర్ వన్ చేశారని చెప్పారు. ఇక్కడికి గోదావరి జలాలలను తరలించిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. నల్గొండ క్లాక్‌టవర్ కూడలిలో భారాస రైతు మహా ధర్నాలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సహా పలువురు ముఖ్య నేతలు ఈ ధర్నాలో పాల్గొన్నారు.



## పితృదేవతలకు ప్రీతికరం

### నేడు మౌని అమావాస్య

- దానధర్మాలు..
- నదీ స్నానాలకు మంచి రోజు
- కుంభమేళాలో స్నానానికి నేడు పోటెత్తనున్న భక్తజనం

04



బాలికపై లైంగికదాడి

## నిందితులకు 25 ఏండ్ల జైలు

- మరో ఇద్దరికి ఐదేండ్ల చొప్పున
- బాల నేరాల ప్రత్యేక న్యాయస్థానం తీర్పు

02

# మరో రెండు ఐటీ పార్కులు



హైటెక్ సిటీ తరహాలో ఏర్పాటు చేసే లక్ష్యం

- వందకోట్ల పెట్టుబడితో ముందుకొచ్చిన 'డ్యూ' సాఫ్ట్‌వేర్ కంపెనీ
- ప్రతినిధులతో చర్చించిన మంత్రి శ్రీధర్ బాబు

03



02

## అమీన్‌పూర్‌లో రంగంలోకి బుల్డోజర్లు

### ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

హైడ్రా మరోసారి పంజా విసిరింది. అమీన్ పూర్‌లో హైడ్రా బుల్డోజర్లు రంగంలోకి దిగి అక్రమ నిర్మాణాలను కూల్చివేశాయి. ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రా అక్రమ నిర్మాణాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందిన వెంటనే హైడ్రా స్పందిస్తూ... వాటిని కూల్చివేసే పనిలో పడుతోంది.

## నాగోబా జాతర ప్రారంభం



04

## థియేటర్లకు హైకోర్టు షాక్

- 16 ఏళ్ల లోపు పిల్లలకు టైమింగ్స్
- ఉదయం 11 తరవాత.. రాత్రి 11 లోపు అనుమతి



04

ప్రతి అక్షరం - ప్రజల కోసం

రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

బుధవారం

29 జనవరి

2025






# వన్ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

వన్ ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు. ఇది మా ప్రభుత్వం సాధించిన కీలక విజయమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు రాకుండా కొందరు కుట్రలు చేశారని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిపై దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. దావోస్ పర్యటనతో రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులను పెట్టేలా మన రాష్ట్రం ఆకర్షించగలిగిందని చెప్పుకొచ్చారు. ఇది నిరంతర పక్రియ అని చెప్పారు. రాజకీయంగా విభేదించినా రాష్ట్ర అభివృద్ధి విషయంలో రాజకీయ వివాదాలకు వెళ్లొద్దని హితవు పలికారు. పెట్టుబడులకు అవసరమైన భూ కేటాయింపులు చేసి అన్ని రకాలుగా ఆ సంస్థలను ప్రోత్సహిస్తామన్నారు. మనందరం కలిసి కష్టపడితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని చెప్పారు. సింగపూర్ ఆధ్వర్యంలో నడుస్తుస్తున్న ఐటీఈ సంస్థతో కూడా ఒప్పందాలు చేసుకున్నామని తెలిపారు. ఇది భవిష్యత్‌లో మన సాంకేతికను పెంపొందించ డానికి ఉపయోగపడుతుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 'విదేశాల నుంచి పెట్టుబడులు తీసుకుని రావాలనేది మా ప్రయత్నం అని అన్నారు వాళ్లు ఇక్కడి నుంచి విదేశాలకు నిధులు తరలించారు. ఇక్కడ కొల్లగొట్టిన సొమ్మునే విదేశీ పెట్టుబడులుగా చూపారు. మేం విఫలమైతే పైశాచిక ఆనందం పొందాలని కొందరు చూశారు. ఇతర రాష్ట్రాలకంటే గొప్పగా పెట్టుబడులు సాధించాం. అసూయతోనే మమ్మల్ని వారు అభినందించడం లేదు. భారీ పెట్టుబడులు తేవడం చూసి కొందరికి కడుపుమంటగా ఉందని పరోక్షంగా బిఆర్ఎస్ నేతలను ఉద్దేశించి అన్నారు. ప్రతిపక్షంలో ఓ నేత అటెన్షన్ డిజార్డర్‌తో బాధపడుతున్నారు. చాలా సంస్థలు మన పెవిలియన్‌కు వచ్చి ఒప్పందాలు



చేసుకున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో ఈస్థాయిలో పెట్టుబడులు రాలేదనే అక్కసుతో ఉన్నారు. ఎనర్జీ పాలసీతోనే తెలంగాణలో పెట్టుబడులు పెరిగాయి. అంతర్జాతీయ సంస్థలను హైదరాబాద్‌కు తీసుకువచ్చేందుకు దావోస్ వెళ్లాం. ప్రపంచ ఆర్థిక సదస్సులో భారీగా పెట్టుబుడులపై ఒప్పందాలు చేసుకున్నాం. తలసరి ఆదాయంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీ కోసం సింగపూర్ ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకున్నాం. స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఇదో అద్భుత పరిణామం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దావోస్ పర్యటనలో గతేడాది కంటే నాలుగు రెట్లు ఎక్కువ పెట్టుబడులు వచ్చాయని ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణ ప్రజలు, యువతకు మేలు చేయాలనేదే తమ ప్రభుత్వ ఆలోచన అని చెప్పారు. ఎన్ని విమర్శలు చేసినా సలహా లాగే తీసుకున్నామన్నారు. సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని నిర్ణయించామని అన్నారు. సాంకేతిక నైపుణ్యం, విద్యార్థుల బదిలీ జరిగేలా ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. రూ.450 కోట్లతో స్కిల్ సెంటర్ ఏర్పాటుకు క్యాపిటలాండ్ ముందుకు వచ్చిందని చెప్పుకొచ్చారు. స్విట్జర్లాండ్‌కు చెందిన మల్టీవాక్ గ్రూప్‌తో ఒప్పందాలు చేసుకున్నామని వివరించారు. దావోస్ పర్యటనలో రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని ఉద్ఘాటించారు. వన్ ట్రిలియన్ ఎకానమీ దిశగా అడుగుపడిందని చెప్పారు. మూసీ పునరుజ్జీవం, యువతకు ఉపాధిపై దృష్టిపెట్టామని తెలిపారు. మూసీని ప్రక్షాళన చేసి ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందిస్తామన్నారు. హైదరాబాద్ అంటేనే .. బిజినెస్ అనే బ్రాండ్ ఏర్పడిందని చెప్పుకొచ్చారు. సాంకేతిక నైపుణ్యాలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మారుస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. 'గతేడాది దావోస్ సదస్సులో రూ.40వేల కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు జరిగాయి. ఇది స్థిరమైన, వ్యాపార అనుకూలమైన ప్రభుత్వం అని వ్యాపారులు విశ్వసించారు. అందుకే 2024 దావోస్ పర్యటనకంటే ఈసారి నాలుగు రెట్లు అధికంగా ఒప్పందాలు జరిగాయి. అధునాతన సాంకేతిక నైపుణ్యాలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చేలా ప్రణాళిక రూపొందించాం అని అన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు యువతకు అందించేలా స్కిల్ యూనివర్సిటీ ప్రణాళిక ఉంది. దావోస్ ఒప్పందాల పెట్టుబడులతో కొత్తగా 49,500 ఉద్యోగాలు వస్తాయి. మూసీ నదిని ప్రక్షాళన చేసి నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అదిస్తాం అని శ్రీధర్‌బాబు తెలిపారు. మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి తదితరులు కూడా పాల్గొన్నారు.



# అమీన్‌పూర్‌లో రంగంలోకి బుల్డోజర్లు

## ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

**సంగారెడ్డి, జనవరి 28:** హైడ్రా మరోసారి పంజా విసిరింది. అమీన్ పూర్‌లో హైడ్రా బుల్డోజర్లు రంగంలోకి దిగి అక్రమ నిర్మాణాలను కూల్చివేశాయి. ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రా అక్రమ నిర్మాణాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందిన వెంటనే హైడ్రా స్పందిస్తూ... వాటిని కూల్చివేసే పనిలో పడుతోంది. ఆక్రమణదారుల వెన్నులో వణుకుపుట్టేలా చేస్తోంది హైడ్రా. తాజాగా అమీన్ పూర్‌లో మరోసారి కూల్చివేతలు చేపట్టింది హైడ్రా. అమీన్ పూర్ పద్మావతి లేఅవుట్‌లో అక్రమంగా వేసిన ఫెన్సింగ్‌ను మంగళవారం ఉదయం హైడ్రా అధికారులు తొలగించేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పెద్ద చెరువు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను హైడ్రా కూల్చివేసింది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి చెందిన ప్రహారీ గోడను గతంలో అధికారులు కూల్చివేశారు. అయితే తిరిగి మరోసారి అక్కడ ఫెన్సింగ్‌ను నిర్మించారు. దీనిపై ఐలాపూర్ రాజగోపాల్ నగర్, బందంకొమ్ము ప్రాంతాల్లో స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు మరోసారి ఫెన్సింగ్‌ను కూల్చివేశారు. అమీన్ పూర్ చెరువు కబ్జా చేసి నిర్మించిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. అక్రమాలపై వచ్చిన పలు ఫిర్యాదుల ఆధారంగా హైడ్రా అధికారులు విచారణ చేపట్టారు. ఆక్రమణ జరిగినట్లు తేలడంతో కూల్చివేతకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు. దీంతో వెంటనే హైడ్రా బుల్డోజర్లు అక్కడకు చేరకుని కూల్చివేతలు జరిపాయి. అమీన్ పూర్ పెద్ద చెరువుకు అనుకుని ఉన్న పద్మావతి నగర్ లేఅవుట్ ఆక్రమణకు గురైంది. 193, 194, 323 సర్వే నెంబర్లో 24 ఎకరాల్లో పద్మావతి లే అవుట్ విస్తరించి ఉంది. రాజకీయ పలుకుబడితో లే అవుట్‌ను కబ్జా చేసి చుట్టూ ప్రహరీ నిర్మించారు కబ్జా దారులు. ఏపీకి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే, అతని అనుచరులు కబ్జాకు పాల్పడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు. సుమారుగా 2006 నుంచి ఈ అంశంపై బాధితులు పోరాడుతున్నారు. ఏళ్లుగా స్థానికంగా ఎవరు పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. మొత్తం 294 ప్లాట్స్‌తో పద్మావతి నగర్ లే అవుట్ ఏర్పాటు చేశారు. గత నాలుగు నెలల క్రితం మొదటగా హైడ్రాను బాధితులు ఆశ్రయించారు. సర్వే చేసి మూడు నెలల క్రితం చుట్టూ నిర్మించిన గోడను హైడ్రా కూల్చివేసింది. అయితే హైడ్రా కూల్చివేతల తరువాత కొద్ది రోజులకే ఐరన్ ఫెన్సింగ్‌కు కబ్జా దారులు వేశారు. దీనిపై మరోసారి హైడ్రా ప్రజావాణిలో బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో హైడ్రా మరోసారి కూల్చివేతలు చేపట్టింది. గతంలో కూడా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పెద్దఎత్తున అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసిన విషయం తెలిసిందే. అమీన్‌పూర్‌లో అక్రమ నిర్మాణాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా.. వాటిని కూల్చివేసింది. వందనపురి కాలనీ సర్వేనెంబర్ 848లో రోడ్డున ఆక్రమించి నిర్మించిన ఇళ్లను హైడ్రా కూల్చివేసింది. ఇళ్లు నిర్మాణంపై ఫిర్యాదులు అందడంతో వెంటనే స్పందించిన హైడ్రా... అక్కడకు చేరుకుని ఇంటిని ప్రొక్లైనర్ల సహాయంతో నేటమట్టం చేసింది. భారీ బందోబస్తు నడుమ హైడ్రా కూల్చివేతలు చేసింది. హైడ్రా కూల్చివేతలపై వందనపురి కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. చాలా కాలంగా అక్రమ ఇళ్ల నిర్మాణంపై పోరాటం చేస్తున్నట్లు వారు తెలిపారు. ఎన్నో సార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధకారులు ఎవరూ పట్టించుకోలేదని.. చివరకు హైడ్రాకు ఫిర్యాదు చేసిన రోజుల వ్యవధిల్లోనే అక్రమంగా నిర్మించిన ఇళ్లను కూల్చివేసిందని కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

# వాతావరణంలో మార్పులు



**సంగారెడ్డి, జనవరి 28:** హైదరాబాద్‌లో సగటు ఉష్ణోగ్రతలు 18 డిగ్రీల సెల్సియస్ పరిధిలో ఉంటాయి. అయితే, ఇటీవల జనవరి మధ్యకాలం నుంచి వీటిలో గణనీయమైన హెచ్చుతగ్గులు చోటుచేసుకున్నాయి. ఉదాహరణకు, జనవరిలో ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోయాయి. ఏప్రిల్ నాటికి ఉష్ణోగ్రత 36-34 డిగ్రీల మధ్యకు చేరుకుంటుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. గడిచిన 5 సంవత్సరాలతో పోలిస్తే ఫిబ్రవరిలో వచ్చిన వాతావరణ మార్పులు చాలా క్లిష్టంగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. జనవరిలోనే హైదరాబాద్ చల్లగా ఉంటుంది. ప్రతి ఏడాది జనవరిలో సగటున ఉష్ణోగ్రతలు 15.6 నుండి 28.5 వరకు నమోదు అవుతాయి. 2022లో జనవరిలో 12లో సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. 2020 లో 11 డిగ్రీల ఉష్ణోగ్రతలు కూడా నమోదయ్యాయి. ఒక 2015 జనవరిలో మాత్రం 34 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సంవత్సరం వాతావరణ మార్పులు ప్రకృతిపై తీవ్రమైన ప్రభావం చూపుతాయని తెలుస్తోంది. ముఖ్యంగా, హైదరాబాదులో విపరీతమైన వేడిగాలులు, వర్షాలు కనిపించవచ్చు. వాతావరణ మార్పులతో పర్యావరణం, పై నా ప్రతికూల ప్రభావం పడనుంది. .పర్యావరణ నిపుణులు గమనించిన విధంగా, క్లైమేట్ మార్పుల వల్ల హైదరాబాద్ వంటి నగరాల్లో కాలుష్యం అధికమవుతోంది. ఇది ప్రజలలో శ్వాస సంబంధిత వ్యాధులు ఎక్కువ అవ్వడానికి కారణమవుతోంది. కాగా ఫిబ్రవరి 15 వరకు వాతావరణంలో భిన్న పరిస్థితులు నెలకొంటాయని వాతావరణ సంచాలకులు నాగరత్నమ్మ తెలిపారు. ఒక్కొక్కప్పుడు చల్లగాలులు, మరొక్కప్పుడు వేడిగాలులు వీస్తాయన్నారామె. ఇక ఫిబ్రవరి 15 తర్వాత వేడి తీవ్రత పెరుగుతుందని, నగర వాసులు అప్రమత్తంగా ఉండాలని ఆమె హెచ్చరించారు.

# లడ్డూ మహోత్సవంలో విషాదం

## యూపీలో వేదిక కూలి ఏడుగురు దుర్మరణం

**లక్నో, జనవరి 28 :** ఉత్తర ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. లడ్డూ మహోత్సవం నిర్వహిస్తున్న ఓ వేదిక కుప్పకూలింది. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందగా.. 60 మందికి పైగా భక్తులు గాయపడ్డారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. యూపీలోని బాగ్‌పత్‌లో ఆదినాథుడి నిర్వాణ లడ్డూ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా చెక్కతో ఏర్పాటుచేసిన వేదిక కుప్పకూలింది. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందారు. అంతేకాక.. జైన శిష్యులు, పోలీసు సిబ్బందితో సహా 60 మందికి పైగా గాయపడ్డారు. మరికొంత మంది శిథిలాల కింద చిక్కుకున్నట్లు తెలుస్తోంది. అధికారులు సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ ప్రమాదంపై సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు వేగవంతం చేయాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

# ఎకో టూరిజం అభివృద్ధికి కృషి



**రంగారెడ్డి,జనవరి 28:** ప్రకృతి రమణీయతకు మారుపేరుగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ఉన్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఏటా కోటి మొక్కలు నాటాలన్న లక్ష్యంతో ఉన్నామని అన్నారు. తెలంగాణను ప్రకృతివనంగా మార్చాల్సి ఉంది. తల్లి పేరిట విద్యార్థులు మొక్కలు నాటి సంరక్షించే విధానం తీసుకొస్తాం. త్వరలో విధివిధానాలు ఖరారుచేస్తాంఅని సీఎం అన్నారు. రంగారెడ్డి జిల్లా పొద్దుటూరులో ప్రపంచస్థాయి ఎకో ఫ్రెండ్లీ ఎక్స్‌పీరియం పార్కును సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రముఖ సినీనటుడు చిరంజీవి, ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో 150 ఎకరాల్లో ఈ పార్కును తీర్చిదిద్దారు. దీనిలో 25వేల జాతుల మొక్కలు ఉన్నాయి. 85 దేశాల నుంచి దిగుమతి చేసుకున్న అరుదైన వృక్షాలు, చెట్లు ఉన్నాయి. ఎక్స్ పీరియం పార్కులో రూ.లక్ష నుంచి రూ.3.5కోట్ల విలువ చేసే అరుదైన వృక్షాలను అందుబాటులో ఉంచారు. ఇప్పటికే పలు వృక్షాలను సినీ, రాజకీయ, వ్యాపార ప్రముఖులు కొనుగోలు చేశారు. రాందేవ్‌రావ్ ఆరున్నరేళ్ల పాటు శ్రమించి ఎక్స్ పీరియంను తీర్చిదిద్దారు. దీనిలో వివిధ ఆకృతుల్లో రాక్ గార్డెన్‌ను సిద్ధం చేశారు. 1500 మంది కూర్చునేలా యాంఫీ థియేటర్‌ను ఏర్పాటు చేశారు. రూ.150 కోట్ల విలువైన మొక్కలు, చెట్లు, వృక్షాలు కలిగిన ఏకైక పర్యాటక ప్రాంతంగా ఇది నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడారు. 'అటవీ ప్రాంతాల సందర్శనకు మధ్యప్రదేశ్, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. మందిరాల దర్శనాల కోసం తమిళనాడు, ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాం. అన్ని సహజ వనరులు ఉన్న తెలంగాణపై గత ప్రభుత్వాలు దృష్టి పెట్టలేదన్నారు. ఎకో టూరిజంపై ఇటీవలే అసెంబ్లీలో చర్చించాం. పర్యాటక పాలసీ తీసుకువచ్చి ఎకో టూరిజాన్ని ప్రోత్సహిస్తాం అన్నారు. ఎకో టూరిజం కింద త్వరలో వికారాబాద్‌ను అభివృద్ధి చేస్తాం. రాష్ట్రంలో మరిన్ని పర్యాటక క్షేత్రాలు రావాల్సి ఉంది. వరితో పాటు వాణిజ్య పంటల ప్రోత్సాహానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు.. అనంతరం నటుడు చిరంజీవి మాట్లాడుతూ రాందేవ్‌ను కొనియాడారు. 'పొద్దుటూరు ప్రదేశం నాకు ముందే తెలుసు. నేను ఇల్లు కట్టుకున్నప్పుడే రాందేవ్ నాకు కొన్ని విదేశీ మొక్కలు ఇచ్చారు. మా ఇంటి వద్ద పెరిగిన మొక్కలను చూస్తే చాలా ఆహ్లాదకరంగా అనిపిస్తుంది. మన హైదరాబాద్‌లోనే ఇలాంటి మొక్కలను రాందేవ్ తీసుకురావడం అభినందనీయం. ఆయన వ్యాపారవేత్తగా కాకుండా కళాకారుడిగా కనిపించారు' అని చిరంజీవి అన్నారు. ఎక్స్‌పీరియం పార్కు హైదరాబాద్‌కు తలమానికం అవుతుందని, ఒక కళాఖండంగా మిగిలిపోతుందని చిరంజీవి అన్నారు. విదేశాలకు వెళ్లినప్పుడు ఇలాంటి మొక్కలు, కళాకృతులు చూస్తుంటాం. ఇండియాకు తీసుకెళ్తే బాగుండని అనిపించేది. ఇక్కడ హైదరాబాద్ శివారులో అవి లభిస్తున్నాయంటే, చాలా ఆనందంగా ఉంది. మా ఇంటి దగ్గర నేను రోజూ కూర్చొనే ప్రదేశంలో బయటకు కనపడకుండా ఫెన్సింగ్‌లా డిజైన్ చేయమంటే, రాందేవ్ అద్భుతంగా చేసి ఇచ్చారు. నా ఇంటి చుట్టూ చాలా చక్కని చెట్లు పెట్టుకున్నా. రాందేవ్ 'కొత్తగా మొక్కలు వచ్చాయి చూస్తారా' అని అడుగుతూ ఉంటారు. ఒకప్పుడు వాటి ధరలు వేలు, లక్షల్లో ఉండేవి. ఇప్పుడు కోట్లలో ఉంటున్నాయి. అసలే నా సంపాదన అంతంత మాత్రంగా ఉంది. కొనలేనేమో అనిపించింది. గౌరవ ముఖ్యమంత్రితో ఇక్కడకు వచ్చి, చూస్తే ఇవన్నీ కొనేయాలనిపిస్తోంది' 'ఇలాంటి వాటిని పెట్టాలంటే వ్యాపార దృక్పథం ఉంటే సరిపోదు. అందుకే రాందేవ్‌లో ఒక ఆర్టిస్ట్‌ను చూస్తా. మొక్కలపై అంత ఇష్టం లేకపోతే దాదాపు పాతికేళ్లు ప్రయోగాలు చేస్తూ, విదేశాల్లో ఉన్న అరుదైన మొక్కలను సైతం ఇక్కడకు తీసుకొచ్చి, ఇది సాధ్యమే అని నిరూపించారు. ఎక్స్‌పీరియంలోని శిలాకృతులు మన హైదరాబాద్‌కు అందం తీసుకొస్తాయి. డబ్బులు, స్థలం ఉంటే ఎవరైనా రియల్ ఎస్టేట్ చేద్దామని అనుకుంటారు. ప్రభుత్వ అనుమతి తీసుకుని, పెద్ద మల్టీస్టోర్ బిల్డింగ్ కడితే, తరాలు నిలిచిపోతుంది. కానీ, రాందేవ్ తన మదిలో ఉన్న దాన్ని వాస్తవంలోకి తీసుకొచ్చారంటే నిజంగా హ్యాట్సాఫ్. 'ఇది షూటింగ్స్‌కు ఇస్తారా రాందేవ్' అని అడిగితే, 'ఫస్ట్ మీ మూవీ షూట్ అయితే ఇస్తా' అన్నారు. ఇప్పుడు కొత్త హీరోయిన్‌ను తీసుకొచ్చి స్టెప్పులు వేయాలంటే ఈ ఎండలో ఎలా ఉంటుందో. వచ్చే శీతాకాలంలో చూద్దాం. ఈలోగా వర్షాలు పడి, మరింత పచ్చదనం పెరుగుతుంది. ఒకట్రెండు ఏళ్లలో కంటికి ఇంపుగా ఉంటుంది. ప్రభుత్వం కూడా రాందేవ్ ఆలోచనలకు సహకారం అందించి, టూరిజం అభివృద్ధికి కృషి చేస్తుందని ఆశిస్తున్నానని అన్నారు. ఎక్స్‌పీరియం హైదరాబాద్‌కు అద్భుతమైన ల్యాండ్ మార్క్ అవుతుంది. హైదరాబాద్ ఇల్లు అనుకుంటే, ఇంట్లో చక్కని పెయింటింగ్ పెట్టుకుంటే ఎలా ఉంటుందో ఈ రోజు ఎక్స్‌పీరియం అలాంటిది' అని చిరంజీవి అన్నారు.

## బాలికపై లైంగికదాడి..

# నిందితులకు 25 ఏండ్ల జైలు

**హైదరాబాద్, జనవరి 28 :** 2023లో ఛత్రినాకలో నమోదైన బాలికపై అత్యాచారం కేసులో నలుగురు యువకులకు బాల నేరాల ప్రత్యేక న్యాయస్థానం 25 ఏళ్ల వరకు కఠిన కారాగార శిక్ష విధించింది. నిందితులు ఎం రాహుల్ (21), ఎం నితిన్ (19)కు 25 ఏళ్ల జైలు శిక్ష విధించగా.. జీ దీక్షిత్, డీ మల్లేష్ కు ఐదేండ్ల వరకు జైలు శిక్ష ఖరారు చేస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. 14 ఏండ్ల లంబాడా అమ్మాయిపై నలుగురు యువకులు అత్యాచారం చేశారు. ఈ ఘటన రెండు సంవత్సరాల క్రితం చత్రినాక వద్ద చోటు చేసుకుంది. నిందితులు, అమ్మాయిని మాయమాటలు చెప్పి ఓ ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెకు మద్యం తాగించేందుకు యత్నించారు. ఆమె నిరాకరించగా, నిందితులు ఆమెను లైంగికంగా వేధించారు. ఒకరు ఆమె పొట్టపై తన్నడంతో, ఆమె అచేతనంగా పడిపోయింది. కొన్ని గంటల తర్వాత, ఆమె స్పృహ లోకి వచ్చింది. తన బట్టలు చిరిగిపోయి ఉన్నాయని, శరీరంలో నొప్పిగా అనిపించిందని తెలిపింది. ఆపై, అక్కడి నుంచి బయటకు వచ్చి పరుగెత్తి.. తల్లిదండ్రులకు జరిగిన విషయం వివరించింది. వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితులపై సామూహిక అత్యాచారం, లైంగిక వేధింపు కేసు నమోదైంది. న్యాయ విచారణలో నిందితులు అమ్మాయిని వివాహం చేసుకోవాలని కోరారు. అయితే ఆమె న్యాయపరమైన పోరాటాన్ని కొనసాగించింది. మేజిస్ట్రేట్ సమక్షంలో నిర్వహించిన ఐడెంటిఫికేషన్ పరేడ్‌లో, బాలిక నిందితులను స్పష్టంగా గుర్తించింది. కోర్టులో పలుమార్లు నిందితుల తరపు న్యాయవాదులు క్రాస్ ఎగ్జామినేషన్ చేసినా బాలిక ధైర్యంగా నిలబడిందని ఒక పోలీసు అధికారి తెలిపారు. కోర్టు బాలికకు రూ.7 లక్షల పరిహారం మంజూరు చేసింది. అయితే, బాలికను ఈ ప్రమాదంలోకి లాగిన స్నేహితురాలు ఇంకా జువెనైల్ న్యాయ మండలిలో విచారణ ఎదుర్కొంటోంది. ఘటన జరిగిన సమయంలో బాధితురాలు మైనర్ గా ఉన్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులకు కోర్టు కఠినమైన శిక్ష విధించింది. ఇద్దరు నిందితులకు 25 సంవత్సరాల శిక్ష విధించగా, మరో ఇద్దరికి 5 సంవత్సరాల శిక్ష విధించింది. ఘటన అనంతరం బాధిత బాలికను వివాహం చేసుకునేందుకు నిందితులు సిద్ధ పడ్డారు. కానీ బాలిక న్యాయపరమైన పోరాటాన్ని కొనసాగించి నిందితులకు శిక్ష పడేలా పోరాటం చేసిందని పోలీసులు తెలిపారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
29 జనవరి
2025



# ఎస్సెస్సీ పరీక్షల్లో సీజీపీఏ కొనసాగించాలి: ట్రస్మా

## జనక్‌పురిలో విశ్వాసంతో ప్రచారం

### భువనగిరి మాజీ ఎంపీ డాక్టరు బూర నర్సయ్య గౌడ్



**న్యూఢిల్లీ, రోమింగ్ న్యూస్:** ఢిల్లీ ఎన్నికల కోసం జనక్‌పురి నియోజకవర్గంలో తెలుగు సెటిలర్‌లతో భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు బిజెపి జాతీయ నాయకులు డాక్టర్ బోర నర్సయ్య గౌడ్ బిజెపికి అనుకూలంగా ఓటేయాలని ప్రచారం నిర్వహించారు. భారీబిస్పందన రావడంతో పాటు వాతావరణం బీజేపీకి అనుకూలంగా ఉందన్నారు. బిజెపి భారీ మెజారిటీతో గెలిచి, ఢిల్లీ అభివృద్ధి, పారదర్శకత మరియు శ్రేయస్సును తీసుకురావడానికి సిద్ధంగా ఉందన్నారు. బీజేపీకి ఓటు వేయండి, మార్పు కోసం ఓటు వేయండనీ పిలుపునిచ్చారు.

## అండర్ -19 క్రికెట్‌లో గొంగడి త్రిష సంచలనం

### అభినందనలు తెలిపిన సిఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్,జనవరి 28 : అండర్-19 మహిళల ప్రపంచకప్‌లో రాణిస్తున్న యువ క్రికెటర్ గొంగడి త్రిషను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. 'అండర్-19 మహిళల విభాగంలో మొట్ట మొదటి సెంచరీ సాధించిన క్రీడాకారిణిగా నిలిచి, ప్రపంచ వేదికపై మన దేశ సత్తా చాటిన తెలంగాణ బిడ్డ గొంగడి త్రిషకు నా హృదయపూర్వక అభినందనలు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి చెందిన త్రిష.. భారత జట్టు విజయంలో కీలకపాత్ర పోషించడం మనందరికీ గర్వకారణం. భవిష్యత్‌లోనూ మరింతగా రాణించి తెలంగాణ క్రీడాకారులకు ఆదర్శప్రాయంగా నిలవాలని ఆశిస్తున్నా. త్రిష లాంటి మరింత మంది మెరికల్లాంటి క్రీడాకారులను తయారు చేసేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది. అద్భుత నైపుణ్యం ప్రదర్శించిన మన క్రీడాకారులకు తగిన గుర్తింపునిస్తూనే.. మరింత మంది తెలంగాణ బిడ్డలు ప్రపంచ స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటుకు సంకల్పించాం. క్రీడల ప్రోత్సాహానికి ప్రజాప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని, త్రిష లాంటి క్రీడాకారిణిల స్ఫూర్తితో మన క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో అద్భుతంగా రాణించాలని పిలుపునిస్తున్నా' అని సీఎం అన్నారు.

## కార్పోరేటర్లు అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

### మరోమారు మేయర్కావాలని కోరుకోవడం లేదు

### జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్పష్టీకరణ

**హైదరాబాద్, జనవరి 28 :** ఇది ఎలక్షన్ ఇయర్.. అభివృద్ధిపై కార్పొరేటర్లు దృష్టి పెట్టాలని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. గొడవలు చేసేందుకు కౌన్సిల్ వేదిక కాదని చెప్పారు. మళ్లీ కార్పొరేటర్‌గా తాను పోటీ చేయనని అన్నారు. మళ్లీ మేయర్ అయ్యే ఆలోచన తనకు లేదని తెలిపారు. మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు ప్రతిపక్షాలకు హక్కు ఉందని విజయలక్ష్మి అన్నారు. అవిశ్వాసానికి స్వాగతిస్తున్నానని చెప్పారు. అవిశ్వాసానికి ఎంతమంది కావాలో కూడా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు తెలియదని అన్నారు. పిబ్రవరి 11వ తేదీ వరకు తామే మేయర్, డిప్యూటీ మేయర్ అని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 11వ తేదీ తర్వాత అవిశ్వాసం పెట్టాలి అంటే ముందుగా కార్పొరేటర్లు, ఎక్స్ ఆఫీసియో సభ్యులు 98 మంది కలెక్టర్‌కు లెటర్ ఇవ్వాలని అన్నారు. అదంతా అవ్వాలి అంటే మార్చి అవుతుందని చెప్పారు. ఈ నెల 30వ తేదీన జరిగే జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ మీటింగ్‌లో ప్రజా సమస్యలపై చర్చ జరగాలని అన్నారు. అందుకు అందరూ సహకరించాలని చెప్పారు. తనపై అవినీతి ఆరోపణలు చేసిన బీఆర్ఎస్ నాయకులకు తన గురించి తెలుసునని చెప్పారు. అక్రమంగా ఆస్తి సంపాదించాల్సిన అవసరం, ఖర్మా తనకు లేదని అన్నారు. బీఆర్ఎస్‌లో తాను ఉంటే చేయని ఆరోపణలు, ఇప్పుడు ఎందుకు చేస్తున్నారో అందరికీ తెలుసునని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు.

## ఢిల్లీల నాలుగంతస్థుల భవనం కూలి నలుగురు మృతి

న్యూఢిల్లీ,జనవరి 28 : ఉత్తర ఢిల్లీలోని బురారి ప్రాంతంలో సోమవారం సాయంత్రం నాలుగంతస్తుల భవనం కూలి ఇద్దరు అమ్మాయిలు సహా మొత్తం ముగ్గురు మరణించారని పోలీసులు మంగళవారం తెలిపారు. ఆస్కర్ పబ్లిక్ స్కూల్ సమీపంలో కొత్తగా కడుతున్న భవనం కూలిపోయింది. ఇప్పటి వరకు 12 మందిని కాపాడినట్లు, మూడు శవాలను శిథిలాల నుంచి వెలికి తెచ్చినట్లు పోలీసులు తెలిపారు. చనిపోయిన వారిలో సాధన(17), రాధిక(7), మరో వ్యక్తిని ఇంకా గుర్తించాల్సి ఉందని పోలీసులు వివరించారు. ఇప్పటికీ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు సమాచారం. 'మేము దర్యాప్తును ప్రారంభించాము. అనేక టీమ్‌లను రూపొందించాము. బిల్డింగ్ ఓనర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటాము' అని ఓ పోలీస్ అధికారి తెలిపారు. ఇదిలావుండగా ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిషి 'ఎక్స్' పోస్ట్‌లో బాధితులకు వీలయినంత సాయం అందిస్తామని పేర్కొన్నారు. కాగా సాయక చర్యలో సాయపడమని స్థానిక పార్టీ ఎంఎల్‌ఏకు మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆదేశించారు. ఢిల్లీ అగ్నిమాపక దళం చీఫ్ సాయక చర్యల వీడియోను మంగళవారం విడుదలచేశారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని వెలికి తీయడానికి డిఎఫ్ఎస్ సిబ్బంది రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారని డిఎఫ్ఎస్ చీఫ్ అతుల్ గార్గ్ తెలిపారు.

## యోగితారాణా ను కలిసిన ట్రస్మా



హైదరాబాద్, 28 జనవరి(రోమింగ్ న్యూస్): తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ప్రతినిధి బృందం రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూదన్, ప్రధాన కార్యదర్శి ఎన్. రమేష్ రావు, మరియు రాష్ట్ర సలహాదారులు కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి యోగితా రాణిని కలిసి ఎస్సెస్సీ పబ్లిక్ పరీక్షలలో సీజీపీఏ విధానాన్ని కొనసాగించేందుకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు పల్లె వినయ్ కుమార్, మెడిచర్ల డైరెక్ట్ అధ్యక్షుడు రమేష్, జిల్లా కార్యదర్శి గుల్షన్, హైదరాబాద్ కార్యదర్శి రఘు, మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో నాయకులు CGPA విధానం విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని స్పష్టం చేశారు. మార్కుల ఆధారిత విధానం అమలులోకి వస్తే, విద్యార్థుల్లో తీవ్రమైన పోటీ, ఆందోళన, ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

CGPA విధానం ముఖ్యమైన ప్రయోజనాలు:

1. ఒత్తిడి రహిత విద్య: CGPA విధానం విద్యార్థులను అవగాహన ఆధారిత అభ్యాసం పట్ల దృష్టిపెట్టేలా చేస్తుంది, మార్కుల కోసం పరుగు తీసే విధానాన్ని తగ్గిస్తుంది.
2. సమగ్ర మూల్యాంకనం: విద్యార్థులను ప్రాజెక్టులు, అసైన్‌మెంట్లు, తరగతి నిర్వహణలో పాల్గొనడం వంటి అనేక అంశాలపై అంచనా వేయడం వల్ల సమగ్ర అభివృద్ధి సాధ్యం.



3. అన్ని విద్యార్థులకు అనువైన విధానం: ప్రత్యేకించి సగటు మరియు తక్కువ మార్కులు పొందే విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందిస్తూ, ఉత్తమ ఫలితాలను సాధించేందుకు మార్గదర్శకం అందిస్తుంది.

CGPA విధానాన్ని కొనసాగించేందుకు చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి TRSMA నాయకత్వం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తుంది. విద్యార్థుల మానసిక ఆరోగ్యం మరియు విద్యా అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని %జ+ూూ% విధానాన్ని కొనసాగించాలని అధికారులను మేము కోరుతున్నాము.

TRSMA విద్యా వ్యవస్థను మరింత విద్యార్థి-స్నేహపూర్వకంగా మార్చేందుకు, తెలంగాణ ప్రభుత్వంతో కలిసి విద్యా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉంది.

Note .అదేవిధముగా పరీక్షలు వ్రాసే జవాబు పత్రాలను తెల్ల పేపర్ కాకుండా cbse మరియు icse పరీక్షలలో ఉపగించే మాదిరిగా సింగల్ (రూల్ )లైన పేపర్ ని ఉపయోగించవాల్లచిందిగా ట్రస్మా రాష్ట్ర సలహాదారులు కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## కుంభమేళాలో టెలికమ్ సేవలు అద్భుతం

### కోట్లాది మంది వచ్చినా అంతరాయం లేకుండా సేవలు



లక్నో,జనవరి 28 : ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా ఘనంగా జరుగు తోంది. కోట్లాదిమంది తరలి వస్తున్నా..టెలికామ్ సేవలకు ఎక్కడా అంతరాయం కలగడం లేదు. ప్రయాగ్ రాజ్ త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు లక్షలాది మంది తరలి వస్తున్నారు. ఇంతమందికి సౌకర్యాలు కల్పించడమంటే మాటలా? అంతేకాదు ఇంతమందికి ఎలాంటి అంతరాయం లేకుండా టెలికాం సేవలు అందించడమూ కత్తిమీద సామే. అలాంటిది భక్తజనం పోటెత్తుతున్నా కాల్స్‌కు అంతరాయం లేకుండా, మెరుగైన ఇంటర్నెట్ సేవల్ని స్థానిక యంత్రాంగంతో కలిసి టెలికాం కంపెనీలు అందిస్తున్నాయి. మహా కుంభమేళాకు వచ్చే ప్రజలకు ఎటువంటి అంతరాయం లేకుండా నెట్‌వర్క్ సేవల్ని అందించాలనే లక్ష్యంతో దాదాపు అన్ని టెలికాం సంస్థలు ఈ ప్రాంతంలో తమ సేవల్ని పెంచుకున్నాయని ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ అండ్ కమాండ్ సెంటర్ (ఎఅఅఅ) నిర్వాహకులు తెలిపారు. ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్, జియో, వొడాఫోన్ ఐడియా కలిసి కుంభమేళా జరిగే ప్రాంతంలో మూడు విపత్తు ప్రతిస్పందన నిర్వహణ కేంద్రాల్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర సమయాల్లో కమ్యూనికేషన్ కోసం, సంక్షోభ పరిస్థితుల్లో వెంటనే

చర్యలు చేపట్టేందుకు ఇవి సాయం చేస్తాయని తెలిపారు. అంతేకాదు టెలికాం ప్రొవైడర్లు 53 వరకు సహాయక కేంద్రాల్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో కొత్తగా 328 టవర్లు, మొత్తం 328 బీటీఎస్‌లు ఏర్పాటు చేశారు. హై స్పీడ్ నెట్‌వర్క్ కవరేజ్ అందించేందుకు 92 కిలోమీటర్ల వరకు ఆప్టికల్ ÷బైర్ కేబుల్స్ వేశారు. కుంభమేళాలో పొరపాటున ఎవరైనా తప్పిపోతే వారి సమాచారం తెలుసు కొనేందుకు నెట్‌వర్క్ సదుపాయం అనేది కీలకం. దీంతో టెలికాం సంస్థలు తమ నెట్‌వర్క్ సేవల్ని మెరుగుపరుచుకున్నాయి. ఎయిర్‌టెల్ కొత్తగా 287 సైట్స్ (టవర్స్), 78 సెల్స్ ఆన్ వీల్స్ ఏర్పాటు చేసింది.

మునుపటి కుంభమేళాతో పోలిస్తే ప్రస్తుతం నెట్‌వర్క్ సదుపాయం మెరుగ్గా ఉందని మహాకుంభ్ నగర్ అదనపు జిల్లా మెజిస్ట్రేట్ వివేక్ చతుర్వేది తెలిపారు. డిజిటల్ పేమెంట్ సదుపాయం ఉండటంతో డబ్బును వెంట తీసుకెళ్లే సమస్య లేదన్నారు. ఇక ఏదైనా సమస్య ఎదురైతే అధికారులకు సమాచారం అందించడం కూడా ప్రస్తుతం సులువుగా మారిందన్నారు. పన్నెండేళ్లకు ఒకసారి జరిగే ఈ కుంభమేళా ఫిబ్రవరి 26 వరకు జరగనుంది. ఈ వేడుక ముగింపు నాటికి 40 కోట్లకు పైగా భక్తులు తరలివస్తారని అంచనా. ఇలా 45 రోజుల పాటు ఈ జరగనుంది. ఇప్పటి వరకు 8 కోట్ల మంది భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. బుధవారం మౌని అమావాస్య రోజు సుమారు 10 కోట్ల మంది భక్తులు తరలివస్తారని అంచనా.

## ఆరాంఘర్ ఫ్లై ఓవర్‌పై ప్రమాదం

### డివైడర్‌ను ఢీకొన్న టూ వీలర్

### ప్రమాదంలో ముగ్గురు యువకుల దుర్మరణం



హైదరాబాద్,జనవరి 28 : హైదరాబాద్ నగరంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రాజేంద్రనగర్ మండలం శివరాంపల్లి క్రాస్ రోడ్ సమీపంలో ఆరాంఘర్ ఫ్లై ఓవర్ పై ఓ బైక్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మరొకరిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందడంతో... ఈ ఘటనలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. సోమవారం అర్ధరాత్రి రాత్రి ఒంటి గంట సమయంలో ప్రమాదం జరిగింది. పోలీసులు మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్ కు తరలించారు. ముగ్గురు మైనర్ బాలురు బహదూర్‌పురా నుంచి ఆరాంఘర్ వెళ్తుండగా వారు ప్రయాణిస్తున్న స్కూటీ ప్రమాదానికి గురైంది. అతివేగం కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన ఈ ఆరాంఘర్ ఫ్లై ఓవర్ ను సీఎం రేవంత్ రెడ్డి ఈ జనవరి మొదటి వారంలో ప్రారంభించారు. ట్రాఫిక్ రద్దీని నియంత్రించడంలో భాగంగా జూ పార్క్ - ఆరాంఘర్ వరకు నాలుగు కిలోమీటర్ల మేర తెలంగాణ ప్రభుత్వం దీనిని నిర్మించింది. అయితే అర్ధరాత్రి యువకులు ఓవర్ స్పీడ్‌తో వెళ్లి డివైడర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.





# కేసీఆర్ ఎప్పుడో చెప్పారు

- కాంగ్రెస్ వస్తే రైతుబంధుకు రాంరాం చెబుతారని..
- మోసం చేయడాన్ని కూడా చారిత్రాత్మకం అంటారేమో!
- నల్గొండ రైతు మహాధర్నాలో కేటీఆర్ చురకలు



**నల్లగొండ, జనవరి 28 :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధు పథకానికి రాంరాం చెబుతారని కేసీఆర్ ముందే చెప్పారని, ఆయన చెప్పిన విధంగానే అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా రైతుబంధు నిధులు రాలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నల్గొండ క్లాక్ టవర్ క్రాస్ రోడ్స్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ రైతు మహాధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాడు నిజాం సర్కార్‌ను నిలదీసిన గడ్డ నల్గొండ అని అన్నారు. నల్గొండ జిల్లాకు కేసీఆర్ ఏం చేశారని అసెంబ్లీలో ఒక మంత్రి ప్రశ్నించారని, వరి ఉత్పత్తిలో ఈ జిల్లాను కేసీఆర్ నెంబర్ వన్‌గా చేశారని కేటీఆర్ తెలిపారు. రైతుబంధు కింద కేసీఆర్ ప్రభుత్వం రైతులకు రూ.73 వేల కోట్లు ఇచ్చిందన్నారు. నల్గొండ బిడ్డలు జీవచ్ఛవాలుగా మారడానికి కారణం కాంగ్రెస్ పార్టీయే కారణమని విమర్శించారు. రైతుబంధు నిధులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందన్నారు. ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి ఎన్నో హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ హామీలపై గ్రామ సభల్లో ప్రజలు నిలదీస్తుంటే పాలకుల వద్ద సమాధానం లేదని కేటీఆర్ విమర్శించారు. రూ.49 వేల కోట్లలో పావు వంతు రుణమాఫీ కూడా కాలేదన్నారు. రైతుబంధు రూ.15 వేలు ఇస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి, ఆఖరుకు రూ.12 వేలు ఇవ్వాలని నిర్ణయించారని మండిపడ్డారు. ఇలా మోసం చేయడాన్ని కూడా చారిత్రాత్మకమే అంటారేమో అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రేషన్ కార్డుకు... రైతు భరోసాకు... కులగణనకు... ఇలా అన్నింటికి దరఖాస్తులు అని చెబుతున్నారని, ప్రస్తుతం రాష్ట్రంలో ఎవరైనా సంతోషంగా ఉన్నారా అంటే అది జిరాక్స్ సెంటర్ల వాళ్లు మాత్రమేనని వ్యంగ్యంగా అన్నారు.






# హైదరాబాద్‌లో మరో రెండు ఐటీ పార్కులు

- హైటెక్ సిటీ తరహాలో ఏర్పాటు చేసే లక్ష్యం
- వందకోట్ల పెట్టుబడితో ముందుకొచ్చిన 'డ్యూ' సాఫ్ట్‌వేర్ కంపెనీ
- ప్రతినిధులతో చర్చించిన ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, జనవరి 28 :** నగర శివారుల్లో కొత్తగా రెండు ఐటీ పార్కులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. హైటెక్ సిటీ తరహాలోనే కొత్తగా మరో రెండు ఐటీ పార్కులను ఏర్పాటు చేయాలని నిర్ణయించా మన్నారు. హైదరాబాద్ లో రూ.100కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన 'డ్యూ' సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులతో సచివాలయంలో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఐటీ రంగంలో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రముఖ కంపెనీలు ఇక్కడ పెట్టుబడి పెట్టేందుకు ముందుకొస్తున్నాయని తెలిపారు. వీటిని ఎంత విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలి? నగర శివారుల్లో ఏయే ప్రాంతాలు ఇందుకు అనుకూలంగా ఉన్నాయో సంబంధిత యంత్రాంగం అధ్యయనం చేస్తోందని తెలిపారు. ఐటీ పార్కుల్లో పనిచేసే ఉద్యోగులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని, రవాణా సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఎక్కడి నుంచైనా ఈ పార్కులకు చేరుకునేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ పార్కుల్లో కొత్తగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే సాఫ్ట్ వేర్ కంపెనీలకు అవకాశం కల్పిస్తామన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పరిశ్రమలకు భూకేటాయింపులపై ఇప్పటి వరకు ప్రత్యేక పాలసీ అంటూ ఏదీ లేదని, దీని వల్ల పారిశ్రామికవేత్తలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అందుకే ప్రత్యేక పాలసీ రూపొందించాలని నిర్ణయించామని, పెట్టుబడితో పాటు కల్పించే ఉద్యోగాల సంఖ్య ఆధారంగా భూమిని కేటాయిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో 100కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన డ్యూ సాఫ్ట్ వేర్ కంపెనీని సంతోషంగా ఆహ్వానిస్తున్నామని, ప్రభుత్వం తరఫున సహకరిస్తామన్నారు. రాబోయే అయిదేళ్లలో ఈ సంస్థ 900 మందికి ఉపాధి అవకాశాలను కల్పించనుందని పేర్కొన్నారు.

# ప్రభుత్వ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్



## 78 మంది విద్యార్థులకు అస్వస్థత

**బడంగ్‌పేట్, జనవరి 28 :** బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గూల్‌లోని కందుకూరు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాలలో జనవరి 26వ తేదీన గణతంత్ర దినోత్సవ వేడుకల రోజున ఫుడ్ పాయిజన్ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫుడ్ పాయిజన్ కారణంగా 78 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. అందులో ఒక విద్యార్థి పరిస్థితి విషమించడంతో చికిత్స నిమిత్తం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వివరాలలోకి వెళితే .... మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్ గూల్ లోని కందుకూరు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాలలో 524 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. జనవరి 26వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా హాస్టల్ ప్రిన్సిపాల్ దానయ్య ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థుల పేరెంట్స్‌ను ఆహ్వానించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రత్యేక వంటకాలను చేయించారు. అంతేగాకుండా బయటి నుంచి కార, బూందిలడ్డును తెప్పించారు. అంతేగాకుండా తమ పిల్లలను చూడడానికి వచ్చిన పేరెంట్స్ కూడా పెద్ద ఎత్తున తినుబండారాలను తీసుకువచ్చారు. హాస్టల్ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కాసేపటికే హాస్టల్ లో వండిన వంటలతో పాటు పేరెంట్స్ తెచ్చిన తినుబండారాలను కూడా విద్యార్థులు కేరింతలు కొడుతూ తిన్నారు. తిన్న కాసేపటికే దాదాపు 78 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన హాస్టల్ ప్రిన్సిపాల్ డ్యూటీ డాక్టర్ ద్వారా వారికి ప్రాథమిక చికిత్సను నిర్వహించారు. అందులో మహబూబ్‌నగర్‌కు చెందిన కార్తీక్ అనే విద్యార్థికి తీవ్ర కడుపు నొప్పి రావడంతో పాటు వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో అతన్ని మెరుగైన చికిత్స నిమిత్తం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్రమేణ కార్తీక్ కోలుకోవడంతో అదే రోజు సాయంత్రానికి ఆసుపత్రి నుంచి కార్తీక్ డిశ్చార్జి అయ్యారు. అయితే అతని తండ్రి బాబు తీసుకువచ్చిన చికెన్ భిర్యానిని అతని కుమారుడు కార్తీక్ తినడం వలనే అతనికి కడుపు నొప్పి వచ్చిందని హాస్టల్ ప్రిన్సిపాల్ దానయ్య తెలిపారు.

### పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు ఆగ్రహం

హాస్టల్ లో ఫుడ్‌పాయిజన్ జరిగి 78 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయితే ఎందుకు పేరెంట్స్‌కు తెలియజేయలేదని పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు చంద్రశేఖర్ ప్రిన్సిపాల్ దానయ్యను ప్రశ్నించారు. ఎప్పటి నుంచి ఆసుపత్రిలో సరైన ఫుడ్ పెట్టడం లేదని, పిల్లలను సరిగ్గా చూడడం లేదని ఆరోపణలు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి ప్రిన్సిపాల్ సముదాయించి నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

## బీసీ రిజర్వేషన్ 42శాతం పెంచిన తరువాత

# స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

### రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



**హైదరాబాద్, జనవరి 28:** స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్ 42 శాతం పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని, లేకపోతే రాష్ట్రం రణరంగంగా మారుతుందని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ వ్యతిరేక చర్యలను ఇప్పటికైనా మానుకోవాలని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడ అభినందన గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన శ్రీరామ్ జ్ఞానేశ్వర్‌కు ఆయన నియామక పత్రం అందజేసి మాట్లాడారు. కుల గణన పూర్తయినప్పటికీ రిజర్వేషన్లు పెంచడానికి ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ లలో బీసీలకు 20 శాతం మాత్రమే రిజర్వేషన్లు ఉన్నాయని, వాటిని 42 శాతం పెంచితేనే బీసీలు రాజ కీయంగా అభివృద్ధి సాధిస్తారని అన్నారు. విద్య, ఉద్యోగ రంగాలలో కూడా బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని, బీసీలలోని అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్కొక్క దానికి వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్‌బీ వేముల రామకృష్ణ, జిల్లపల్లి అంజి, నంద గోపాల్, మట్ట జయంతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# హుస్సేన్‌సాగర్ ప్రమాద ఘటనలో ఒకరి మృతి

### గల్లంతైన యువకుడి కోసం విస్తృతంగా గాలింపు



**హైదరాబాద్, జనవరి 28:** హుస్సేన్‌సాగర్ అగ్నిప్రమాద ఘటనలో ఒకరు మృతి చెందారు. రెండు రోజుల క్రితం భారతమాతకు హారతి కార్యక్రమంలో అగ్నిప్రమాదం జరుగగా బోటు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో గణపతి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రికి తరలించారు. అయితే 80 శాతం కాలిన గాయాలతో చికిత్స పొందుతూ గణపతి మంగళవారం మృతిచెందాడు. మృతుడు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అలాగే బోటు ప్రమాదం సమయంలో గల్లంతైన యువకుడు అజయ్ కోసం గాలింపు కొనసాగుతోంది. రెండో రోజు హుస్సేన్‌సాగర్‌లో రెస్క్యూ బృందాలు గాలిస్తున్నాయి.గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26న భారత మాతకు మహా హారతి కార్యక్రమం నిర్వహించారు. అదే సమయంలో హుస్సేన్సాగర్‌లో రెండు బోట్లు ఉంచి బోట్లలో నుంచి టపాసులు పేల్చాలని నిర్వాహకులు ప్లాన్ చేశారు. అయితే టపాసులు పేలుస్తున్న సమయంలో అపశృతి చోటు చేసుకుంది. టపాసులు దిశ మార్చుకుని నిల్వ ఉంచిన టపాసులపై పడటంతో ఒక్కసారిగా భారీ శబ్దంతో అవి పేలాయి. దీంతో రెండు బోట్లు దగ్ధమయ్యాయి. అదే సమయంలో బోట్లో ఉన్న వారంతా తమ ప్రాణాలను రక్షించుకోడానికి కిందకు దూకారు. అయితే టపాసులు పెద్ద ఎత్తున పేలడంతో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ సమయంలో బోట్లలోనే ఉన్న గణపతి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గణపతి క్రాకర్స్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. క్రాకర్స్ పేలుస్తున్న సమయంలోనే ప్రమాదం జరగడంతో గణపతికి 80 శాతం వరకు కాలిన గాయాలయ్యాయి. వెంటనే యశోదా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గణపతి మరణించాడు. ఇదే ప్రమాదంలో బోటు ఆపరేట్ చేస్తున్న మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. వారు ప్రస్తుతం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. అయితే ఈ బోటులో అజయ్ అనే యువకుడితో పాటు మరో ఇద్దరు స్నేహితులు ఉన్నారు. అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో ప్రాణాలను దక్కించుకునేందుకు అజయ్‌తో పాటు ఇద్దరు స్నేహితులు హుస్సేన్ సాగర్‌లో దూకారు. అయితే ఇద్దరు స్నేహితులు క్షేమంగా బయటకు రాగా.. అజయ్ మాత్రం గల్లంతయ్యాడు. రెండు రోజులుగా అజయ్ కోసం రెస్క్యూ టీం గాలింపు చర్యలు కొనసాగిస్తోంది. అజయ్ కనిపించడం లేదంటూ తల్లిదండ్రులు ఫిర్యాదు చేసే వరకు కూడా అతడు అదృశ్యమైనట్లు ఎవరూ గుర్తించలేదు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు అజయ్ కోసం ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిన్న ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగు బృందాలు రెస్క్యూ ఆపరేషన్‌ను కొనసాగించారు. తిరిగి ఈరోజు తెల్లవారుజాము నుంచి రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ప్రాణాలను కాపాడుకునే సమయంలో నీళ్లలో దూకిన వీరంతా లైఫ్ జాకెట్లు ధరించలేదని తెలుస్తోంది. అజయ్ ఆచూకి కనుగోనాలంటూ తల్లిదండ్రులు హుస్సేన్‌సాగర్ ఒడ్డునే కూర్చుని రోదిస్తున్న తీరు అందరినీ కంటతడిపెట్టిస్తోంది.

# బండిసంజయ్ దిష్టిబొమ్మ దహనం



**రాజన్న సిరిసిల్ల, జనవరి 28:** ప్రజా గాయకుడు గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. తాజాగా రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండపల్లిలో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంజయ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. తన ఆట, పాటలతో ప్రపంచ ప్రఖ్యాతి పొందిన గద్దర్‌పై సంజయ్ నోరు పారేసుకోవడం సరైంది కాదన్నారు. బండి సంజయ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కాగా, 'నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా బీజేపీ కార్యకర్తలు ఆందోళన చేస్తే.. నక్సలైట్లతో కలిసి ఎంతో మందిని గద్దర్ హత్య చేయించారు. అలాంటి వ్యక్తికి పద్మ అవార్డు ఎందుకు ఇవ్వాలి' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
29 జనవరి
2025








గద్దర్ చుట్టూ కొత్త రాజకీయం మొదలయ్యింది. గద్దర్ నక్సలైట్ కనుక ఆయనక పద్మ అవార్డు ఎలా ఇస్తామన్నకేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలతో ఇప్పుడు సర్వత్రా చర్చలు..ఉప చర్చలు..విమర్శలు, ప్రతి విమర్శలు మొదలయ్యాయి. తాజాగా తెలంగాణ నుంచి ప్రముఖులు ఎవరికీ పద్మ అవార్డులు రాకపోవడం, దీనిపై సిఎం రేవంత్రెడ్డి తీవ్రంగా స్పందించడం..తిరిగి బండి సంజయ్ విమర్శలు చేయడం తో కథ మొదలయ్యింది. నిజానికిపద్మ అవార్డులే కాదు..ప్రతి ఒక్క విషయంపైనా ప్రజల్లో చర్చ జరగాలి. అనుయాయులకు నామినేటెడ్ రాజ్యసభ సభ్యత్వాలు, పద్మ అవార్డులు, భారతరత్నలు కూడా ఇచ్చేస్తున్నారు. అవార్డుకు ఎంపికైన వ్యక్తి అర్హుడా కాదా అన్నది చూడడం లేదు. గతంలో సచిన్ టెండుల్కర్‌కు భారతరత్న ఇచ్చారు. ఆయన దేశానికి ఏ రకంగా ఉపయోగ పడ్డాడో తెలియదు. తన సొంత కెరీర్, రికార్డుల కోసం మాత్రమే అతను క్రికెట్ ఆడాడు. సామాజికంగా బాధ్యతగా పెద్ద సేవలేవీ చేయలేదు. కానీ దేశానికి సేవ చేయడమే గాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థలో మూలస్తంభంగా నిలిచిన రతన్ టాటాకు మాత్రం మనం భారతరత్న ఇవ్వలేదు. ఆయన బతికి ఉన్నప్పుడే ఇచ్చివుంటే గౌరవించుకుని ఉన్నట్లుగా ఉండేది. పివి నరసింహారావుకు భారత రత్న ఇవ్వడంలో కాంగ్రెస్ చేసిన రాజకీయం అంతా ఇంతాకాదు. దేశాన్ని నిలబెట్టిన పివిని అవమానించిన కాంగ్రెస్, చివరకు భారతరత్న ఇవ్వకుండా మరింతగా అవమానిం చింది. అలాంటి కాంగ్రెస్ ఇప్పుడు రాజ్యాంగం పేరిట రాజకీయాలు చేస్తోంది. ఇక బిజెపి కూడా సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్‌ను రాజ్యసభకు పంపింది. అలాగే కాంగ్రెస్ తెలంగాణ నుంచి అభిషేక్ మనుసిం ఘ్వీని రాజ్యసభకు పంపింది. తెలంగాణ కోసం కొట్లాడిన ఎందరినో కాదని ఓ లాయర్‌కు అవకాశం ఇచ్చింది. ఎవరు అధికారంలో ఉన్నా నిజాయితీ లేకుండా పోయింది. అందుకు బిజెపి మినహాయింపు కాదని చెప్పాల్సిందే. ఇవన్నీ ఇలావుంటే తాజాగా పద్మ అవార్డుల పంచాయితీ వచ్చింది. తెలంగాణలో పద్మ అవార్డుల పంచాయితీ రచ్చ చేసింది. ఈ వ్యవహా రంపై ఇటు కాంగ్రెస్..అటు బీజేపీ నేతలు తగ్గేదే లేదంటూ కౌంటర్లు విసురుతున్నారు. రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వానిది..ముమ్మాటికి వివక్షే అని కాంగ్రెస్ పార్టీ మండిపడుతోంది. అటు బీజేపీ మాత్రం..జాబితా పంపించినంత మాత్రాన అనర్హులకు అవార్డులు ఇవ్వాలా అంటూ ప్రశ్నిస్తోంది..? ఇలా.. రిపబ్లిక్‌డే ముగిసినా.. తెలంగాణలో పద్మ అవార్డులపై రాజకీయ రచ్చమాత్రం చల్లారడం లేదు. ఈ వ్యవహారంపై రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు ఐదు అవార్డులు వచ్చినప్పుడు తెలం గాణకు కనీసం నాలుగు అవార్డులు కూడా ఇవ్వక పోవడం వివక్ష కాదా అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారు.. తెలంగాణ ప్రభుత్వ సిఫార్సులను కనీసం పట్టించుకోలేదని మండిపడ్డారు. గద్దర్, చుక్కా రామయ్య, అందెశ్రీ, గోరేటి వెంకన్న, జయ ధీర్ తిరుమలరావు పేర్లు.. పద్మ అవార్డుల కోసం పంపించారు. వీరి పేర్లను రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసింది. కానీ వీరిలో ఏ ఒక్కరి పేరును కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదన్నారు.. ఈ విషయంలో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై కేంద్రానికి నిరసన తెలియజేస్తామని స్పష్టం చేశారు. అయితే ఇందులో కనీసం చుక్కారామయ్య పేరును కూడా పరిశీలించకపోవడం, కవి అందెశ్రీ పేరును కూడా పరిశీలించకపోవడం దారుణంగానే చూడాలి. గద్దర విషయంలో కూడా బిజెపి అతిగా మాట్లాడడం మానితే మంచిది. గద్దరు ప్రజాకవి. నక్సలైట్ ఉద్యమం నుంచి జనజీవన స్రవంతిలోకి వచ్చారు. అలా వచ్చిన వారిలో ప్రస్తుత మంత్రి సీతక్క కూడా ఉన్నారు. వారిని తక్కువ చేసి చూడడం, మాట్లాడడం మంచిది కాదు. పద్మ అవార్డుల విషయంలో జరిగిన వివక్ష క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందించారు. అయితే నక్సల్స్ భావజాలంతో ఎందరో బీజేపీ నేతలను చంపించిన గద్దర్‌లాంటి వ్యక్తులకు..పద్మ అవార్డులు ఎలా ఇస్తామని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. అలాంటి వ్యక్తులకు బరాబర్ అవార్డులు ఇవ్వమని స్పష్టం చేశారు. రాష్ట్రం ప్రభుత్వం పంపించిన పేర్లను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుందన్న బండి.. అర్హులైన వారికే పద్మ అవార్డులు వస్తాయని తేల్చిచెప్పారు. గద్దర్‌పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు..ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. మాజీ నక్సలైట్లకు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వొచ్చు కానీ.. పద్మ అవార్డులు ఇవ్వడానికి పనికి రారా? అని ప్రశ్నలు సంధించారు. తెలంగాణ కోసం పోరాడిన గద్దర్ లాంటి వ్యక్తిని పద్మ అవార్డులకు ప్రతిపాదిస్తే తప్పా అని ప్రశ్నించారు. బీజేపీ భావజాలం ఉన్నవారికి మాత్రమే అవార్డులు ఇస్తారా?అని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ ప్రశ్నించారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం గద్దర్ పోరాటం చేశారన్న చామల.. గద్దర్‌పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని అన్నారు. గద్దర్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ ఖండించారు... బుద్దిస్ట్ మీకు మావోయిస్టుగానే కనబడ్డారా? అని ప్రశ్నించారు. గద్దర్‌లోని తెలంగాణ ఉద్యమకారుడు, దళిత ప్రజా ఉద్యమకారుడు కనిపించలేదా? అని నిలదీశారు. గద్దర్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలు వ్యక్తిగతమా.. పార్టీ విధానమా? చెప్పాలని డిమాండ్ చేశారు అద్దంకి. అయితే.. కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు బండి సంజయ్. భావజాలం వేరు మావోయిస్టుగా చేయడం వేరన్న బండి.. మావోయిస్టులతో ఈటలకు సంబంధం లేదని చెప్పారు. ప్రభుత్వం ఇస్తామంటున్న గద్దర్ అవార్డులను బీజేపీ వాళ్లు తీసుకోరని స్పష్టం చేశారు. అటు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కూడా పద్మ అవార్డులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీతో సత్సంబంధాలు ఉన్న వారికే కేంద్ర ప్రభుత్వం అవార్డులు ఇచ్చిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిరంజీవికి ఇస్తే, ఇప్పుడు బీజేపీ బాలకృష్ణకి ఇచ్చిందని విమర్శించారు. గద్దర్‌కు, ఎల్టీటీఈకి పెద్దతేడా లేదంటూ మరో బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పలు విధానాలపై ఇప్పటికే మండిపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. తాజాగా యూజీసీ, పద్మ అవార్డుల అంశంలోనూ మోదీ సర్కారు తీరును తప్పుబడుతోంది. ఈ క్రమంలో బీజేపీ, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. అయితే అవార్డుల ఎంపిక ఖచ్చితంగ ఆపారదర్శకంగానే సాగాలి. అర్హులకే అవార్డులు కానీ, రాజ్యసభ సభ్యత్వాలు కానీ దక్కాలి. బిజెపి ఈ విసయంలో పారదర్శకంగా పనిచేస్తే మంచిది




# పితృదేవతలకు ప్రీతికరం

## నేడు మౌని అమావాస్య

### దానధర్మాలు.. నదీ స్నానాలకు మంచి రోజు

### కుంభమేళాలో స్నానానికి నేడు పోటెత్తనున్న భక్తజనం



**ప్రయాగరాజ్, జనవరి 28:** ఈ నెల 29న మౌని అమావాస్య రానుంది. కుంభమేళా జరుగుతున్న వేళలో ఈ అమావాస్య ప్రత్యేకమైనదిగా పురాణాలు పేర్కొంటున్నాయి. మౌని అంటే సంస్కృతంలో మౌనంగా ఉండటం. ఈ దినాన మౌనదీక్ష పాటించాలి. ఎవరితోనూ మాట్లాడకుండా పూర్తిగా మౌనంగా ఉండాలి. మహాశివరాత్రి ముందు వచ్చే అమావాస్య కావడంతో సాధువులు, యోగసాధకులు దీన్ని పవిత్రంగా పరిగణిస్తారు. శాస్త్రాల ప్రకారం మన ఆలోచనలకు మూలబిందువు చంద్రుడు. అమావాస్య కావడంతో ఆ రోజున చంద్రుని ప్రభావం ఉండదు. అందుకనే మన నోటి నుంచి వచ్చే మాటలపై నియంత్రణ ఉండదు. వీటి నియంత్రణకే పూర్తిగా మౌనం పాటించాలి. మన మనసుపై నియంత్రణ లేకపోతే ఏం మాట్లాడుతామో ఏం చేస్తామో తెలియదు. అందుకే పూర్తిగా మౌనంగా ఉండాలి. దీంతో అంతఃశుద్ధీకరణ జరుగుతుంది. మాటలపై నియంత్రణ ఎలా ముఖ్యమో భగవద్గీతలోని ఒక పద్యం ఇలా వివరిస్తుంది. మానవునికి అతని మనస్సే పెద్ద సాయం చేస్తుంది. ఏ నిర్ణయమైనా మనసే మంచిదో కాదో చెబుతుంది. దీని ప్రకారంగా మనల్ని మనం బాగు చేసుకోవాల్సివుంటుంది. అంతేగాని పెడమార్గం పట్టరాదు. పరిపూర్ణమైన మనసు మిత్రుడిగా ఉంటుంది. కలుషితమైతే శత్రువుగా మారుతుంది. ఆధ్మాత్మికంగా ఈ రోజు గంగానదిలో ప్రత్యేకించి త్రివేణి సంగమంలోని జలాలు అమృతంతో సమానంగా ఉంటాయి. ఈ సమయంలో పుణ్యస్నానమాచరిస్తే ఎన్నో జన్మల పుణ్యం లభిస్తుంది ఇంత పవిత్రదినం కావడంతో ఈ రోజే కొత్తగా నాగ సాధువుల్లో చేరేవారికి దీక్షఇస్తారు. రావిచెట్టు నీడలో దీపాలు వెలిగించి పితృదేవతలకు తర్పణం కూడా పెట్టాలి. హిందూ సంప్రదాయంలో అమావాస్యకు ప్రాధాన్యత ఉంది. ఆ రోజున విష్ణుమూర్తి, సూర్యభగవానులను పూజిస్తారు. ముఖ్యంగా పుష్య అమావాస్య లేదా మౌని అమావాస్య మరింత ప్రత్యేకమైంది. ఈ రోజున రాగిగిన్నెలో స్వచ్ఛమైన నీరు, ఎర్ర చందనం, ఎర్రటి పూలు వేసి.. ఆ నీటిని సూర్యుడికి సమర్పించాలి. పూర్వీకుల ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ ఉపవాసం ఉండి దానధర్మాలు చేయాలి. తులసి మొక్కను పూజించి, తులసికోట చుట్టూ ప్రదక్షిణలు చేయాలి. ఇలా చేయడం వల్ల పితృ దేవతల దోషాలేమైనా ఉంటే తొలగిపోతాయి. పురాణ కథనం ప్రకారం అమావాస్య రోజున గంగమ్మ తల్లి అమృతంగా మారి ఆకాశం నుంచి కిందికి దిగివస్తుంది. ఈ రోజున గంగానదిలో స్నానం చేస్తే పరమపుణ్యమని, అలా అవకాశం లేకుంటే మరే నదిలోనైనా స్నానం చేయాలన్నది పెద్దల మాట. పుష్య అమావాస్య రోజున చేసే సత్కార్యాలకు గొప్ప ఫలితాలు లభిస్తాయి. ఈ అమావాస్యను లఘు పితృపక్షంగా పరిగణిస్తారు. ఈ రోజున భగవద్గీత పఠించాలి. రావిచెట్టుకు నీరుపోసి, దాని వద్ద దీపం వెలిగించాలి. ఇలా చేయడం వల్ల కూడా పితృదేవతలకు పుణ్యలోక ప్రాప్తి కలుగుతుంది. ఈ క్రమంలో మహా కుంభమేళా దారులు పవిత్ర ప్రయాగ్ రాజ్ వైపే.. భక్త జనసంద్రానికి తీరమా.. అన్నట్టుగా త్రివేణి సంగమం సకల జనుల సందడితో కిక్కిరిసిపోతుంది.. విభుడు, దేవాదిదేవతలు దివి నుంచి దిగి వచ్చే అమృత కాలమే మహా కుంభమేళ. ఈ 45 రోజుల్లో ఏ రోజులు త్రివేణి సంగమంలో పుణ్య స్నానం ఆచరిస్తే సకల శుభాలు కలుగుతాయనేది భక్తుల విశ్వాసం. అందుకే భువి నలుచెరుగుల నుంచి సాధుసంతులు, అఘోరాలు, మాన్యులు, సామాన్యులు ప్రయాగ్ రాజ్‌కు పోటెత్తుతున్నారు. ఇప్పటికే కోట్ల మంది భక్తులు స్నానం ఆచరించారు . ఇన్ని రోజులు ఒక లెక్క. ఈ నెల 29న పోటెత్తే రద్దీ మరో లెక్క. బుధవారం మాఘమాస మౌని అమావాస్య మహిమాన్వితమైన సుదినం.. మహాకుంభ మేళలో స్నానమాచరించడమే ఎంతో పుణ్యం. ఇక మాఘ మాస మౌని అమావాస్య కలిసొచ్చిన వేళ.. గంగా స్నానం చేస్తే మరెంతో పుణ్యం. దానాలు చేస్తే జన్మ ధన్యం అనేది భక్తుల విశ్వాసం.. మౌని అమావాస్య రోజున అందరూ షాహి స్నాన్ ఆచరిస్తారు..మౌని అమావాస్య ధ్యానానికి జ్ఞానానికి చిహ్నం. ఆరోజు మౌనంగా వుంటూ ..పరమేశ్వుడిని ధ్యానిస్తూ పవిత్ర గంగా స్నానంచేసి పితృదేవుళ్లకు నీరాజనాలు అర్పిస్తారు. తద్వారా పూర్వీకులకు సద్గతులు కలగడం సహా అందరికీ సకల శుభాలు కలుగుతాయంటారు పండితులు. మహాకుంభమేళానే ఎంతో మహిమాన్వితం. ఇక ఈసారి మౌని అమావాస్య కలిసిరావడం మరెంతో శుభప్రదం..ప్పటికే మహా కుంభ మేళాలకు కోట్లలో తరలి వస్తున్నారు భక్తులు.ఇక మాఘ మాస మౌన అమావాస్య ఒక్కరోజే పది కోట్లకు మంచి భక్తులు తరలి వస్తారనేది అంచనా. మౌన అమావాస్య కోసం భారత రైల్వే 150 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఎవరికీ ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా యూపీ సర్కార్ పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.

# నాగోబా జాతర ప్రారంభం

**ఆదిలాబాద్, జనవరి 28:** ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్‌లో మెస్రం వంశీయులు మంగళవారం నాగోబా జాతర పూజలను ప్రారంభించారు. గంగా జలాన్ని, ఆలయ ప్రాంగణంలోని మురాడి వద్దకు మెస్రం వంశీయులు తీసుకొచ్చారు. గ్రామంలోని పాత ఆలయం నుంచి నాగోబా విగ్రహాన్ని ఊరేగింపుగా గర్భగుడిలో భద్రపరిచారు. అనంతరం ఆలయ సమీపంలోని కోనేరు నుంచి మట్టి కుండల్లో నీటిని తీసుకువచ్చి పుట్టలు చేస్తారు. అర్ధరాత్రి 11:30 సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జాతర ప్రారంభం కానుంది. పూజా కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు మెస్రం వంశీయులు పాల్గొంటారు. ఐదు రోజులపాటు జరిగే జాతరలో తెలుగు రాష్ట్రాల నుంచి కాక మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిషా రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు హాజరవుతారు. ఈ జాతరకు తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలను పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. దీంతో ప్రభుత్వం సుమారు 600 మంది పోలీసులు, 100 సీసీ కెమెరాలతో పటిష్ట భద్రత ఏర్పాటు చేసింది.ప్రతి సంవత్సరం పుష్య అమావాస్య సందర్భంగా గిరిజనుల ఇలవేల్పు నాగోబా మహాపూజ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందుకోసం మెస్రం వంశీయులు నెల రోజుల ముందు నుండే ఏర్పాట్లు చేపడతారు. కాలినడకన సుమారు 250 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి తీసుకువచ్చిన పవిత్ర గోదావరి జలాలలో నాగోబాకు అభిషేకం, మహాపూజ చేయడంతో ఈ ఇక్కడ జాతర మహోత్సవం ప్రారంభమవుతుంది. ఇప్పటికే నాగోబా అభిషేకానికి



కావాల్సిన పవిత్ర గంగా జలాలను తీసుకొని కేస్లాపూర్‌కు వచ్చిన మెస్రం వంశీయులు ఆలయ సమీపంలోని మర్రి చెట్టు వద్ద విడిది చేసి ఉన్నారు. మంగళవారం రాత్రి అక్కడి నుండి గిరిజన సంప్రదాయ దుస్తుల్లో వాయిద్యాలతో ఆలయానికి చేరుకుంటారు. అనంతరం మెస్రం వంశీయులు, కట్టోడాలు ఆలయాన్ని శుద్ధి చేస్తారు. ప్రత్యేకంగా ఆదిలాబాద్ జిల్లా సిరికొండలో తయారు చేయించిన కుండలను మాత్రమే గిరిజనులు ఇక్కడ పూజలకు వినియోగించడం ఆనవాయితీగా వస్తుంది.


### సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. వనమే ఆలంబనగా అత్యంత నియమ నిష్టలతో ఆదివాసీలందరూ జరుపుకునే వేడుక నాగోబా జాతర అని, గిరిజన సోదర, సోదరీమణులు అందరికీ శుభాకాంక్షలు అంటూ పేర్కొన్నారు. పుష్య అమావాస్య నాడు ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో అంబరాన్నంటే ఈ ఆదివాసీ సంబురం తెలంగాణ సాంస్కృతిక వైభవమని పేర్కొన్నారు. దేశంలో రెండో అతిపెద్ద ఆదివాసీ వేడుకలో ఆధ్యాత్మక వెలుగులు నింపే ఆదిశేషువు కరుణాకటాక్షాలు అందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. వనమే ఆలంబనగా అత్యంత నియమ నిష్టలతో ఆదివాసీలందరూ జరుపుకునే వేడుక "నాగోబా జాతర" సందర్భంగా ముఖ్యమంత్రి గిరిజన సోదర, సోదరీమణులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# థియేటర్లకు హైకోర్టు షాక్

- 16 ఏళ్ల లోపు పిల్లలకు టైమింగ్స్
- ఉదయం 11 తరవాత.. రాత్రి 11 లోపు అనుమతి

**హైదరాబాద్, జనవరి 28:** పుష్ప 2' సినిమా ప్రీమియర్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన అనంతరం తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పును ఇచ్చిన విషయం తెలిసిందే. హైకోర్టు తీర్పును తెలంగాణ ప్రభుత్వం కూడా సీరియస్‌గా తీసుకుని ఇకపై బెనిఫిట్ షోలు, టికెట్ల ధరలు పెంచుకోవడాలు వంటి వెసులుబాటు ఉండదని స్పష్టంగా ప్రకటించింది. సంక్రాంతికి వచ్చిన 'గేమ్ చేంజర్' సినిమాకు టికెట్ల ధరను పెంచుకునే వెసులుబాటు కల్పించినా.. కోర్టు కలగజేసుకోవడంతో.. వెంటనే టికెట్ల ధరలను తగ్గించారు. దీంతో చిన్న సినిమాలకు ఏమోగానీ.. భారీ బ్జడెట్‌తో రూపొందే సినిమాలకు మాత్రం అంతే భారీగా ఇబ్బంది నెలకొంది. ఇదిలా ఉంటే.. తాజాగా హైకోర్టు.. ఫ్యామిలీ ఆడియన్స్‌కు, థియేటర్ సినిమాలకు మరో భారీ షాక్ ఇచ్చింది. ఇకపై థియేటర్స్‌లో పిల్లలు సినిమా చూడాలంటే నిర్దిష్ట సమయంలో మాత్రమే చూడాలనేలా తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఉదయం 11 గంటల్లోపు, రాత్రి 11 గంటల తరువాత 16 ఏళ్లలోపు పిల్లలను సినిమాలకు అనుమతించరాదని థియేటర్లకు హైకోర్టు తెలిపింది. 'గేమ్ ఛేంజర్' మూవీ టిక్కెట్ ధరల పెంపును, అదనపు షోలకు



అనుమతించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన 4 పిటిషన్లపై విచారణ చేపట్టగా.. పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ హైకోర్టు గత ఉత్తర్వుల మేరకు బెనిఫిట్ షోకు అనుమతిస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను పునః సమీక్షించి, ఇకపై బెనిఫిట్ షోలకు అనుమతించరాదని నిర్ణయం తీసుకుంటూ జనవరి 11న ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రజా ప్రయోజనాలు, ఆరోగ్యం, రక్షణలను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వకూడదనేలా నిర్ణయం తీసుకుందని తెలిపారు. అలాగే సినిమాటోగ్రఫీ నిబంధనల ప్రకారం ఉదయం 8.40లోపు, అర్ధరాత్రి 1.30 గంటల తర్వాత సినిమాలకు అనుమతించరాదని పేర్కొన్నారు. ముఖ్యంగా మైనర్లను అనుమతించరాదని, లేని పక్షంలో అది వారి శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రస్తుతం మల్టీప్లెక్స్ థియేటర్లలో చివరి షో అర్ధరాత్రి 1.30 గంటల వరకు నడుస్తుందని, ఇందులో మైనర్ల ప్రవేశానికి ఎలాంటి నియంత్రణలు లేవని కోర్టుకు తెలిపారు. అంతేకాకుండా, 'పుష్ప 2' బెనిఫిట్ షో సమయంలో జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతి చెందగా, బాలుడు తీవ్రంగా గాయపడ్డాడని.. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సూచించారు. ఇప్పుడు కోర్టు ఇచ్చిన ఆదేశాలతో సెకండ్ షోలకు 16 సంవత్సరాల లోపు వారి నిషేధాన్ని అమలు చేయటం వల్ల అది కచ్చితంగా వసూళ్లపై ప్రభావం చూపుతుంది. అసలే ఓటీటీలు వచ్చి.. ప్రేక్షకులను థియేటర్లకు రానివ్వకుండా చేస్తుంటే.. ఇప్పుడీ ఆదేశాలు మరింతగా థియేటర్లపై ప్రభావం చూపే అవకాశం అయితే లేకపోలేదు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
29 జనవరి
2025





# ఇంత క్రూరంగా కూడా చంపుతారా?

**వెంకటమాధవి హత్య కేసులో నివ్వెరపోయే నిజాలు**

**గురుమూర్తిని అరెస్ట్ చేసి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసిన పోలీసులు**

**వివరాలు వెల్లడించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు**




**హైదరాబాద్, జనవరి 28 :** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మీర్‌పేట హత్య కేసులో నిందితుడు గురుమూర్తిని పోలీసులు మంగళవారం మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. కేసు వివరాలను రాచకొండ సీపీ సుధీర్‌బాబు వెల్లడించారు. వెంకట మాధవి హత్య కేసు దర్యాప్తులో ఆధారాలు సేకరించేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చిందన్నారు. 'ఒక మనిషిని ఇంత క్రూరంగా చంపుతారా?' అని మేం నివ్వెరపోయామన్నారు. భార్యను ఇంత దారుణంగా చంపిన గురుమూర్తిలో ఎలాంటి పశ్చాత్తాపం కనిపించడం లేదన్నారు.' క్షణికావేశంలో జరిగిన హత్య కాదు.. పథకం ప్రకారమే హత్య చేశాడు. గురుమూర్తి స్వతహాగానే క్రూరుడు' అని సీపీ వివరించారు. 'సంక్రాంతి పండగకు మాధవి, గురుమూర్తి తమ పిల్లల్ని తీసుకుని బంధువుల ఇంటికి వెళ్లారు. 15న పిల్లల్ని బంధువుల ఇంటి వద్దే వదిలేసి వెంకటమాధవి, గురుమూర్తి రాత్రి 10.41 గంటలకు ఇంటికి చేరుకున్నట్లు సీసీటీవీ ఫుటేజ్‌లో గుర్తించాం. 16న ఉదయం 8 గంటలకు ఆమెతో అకారణంగా గొడవ పెట్టుకొని ఘర్షణకు దిగాడు. మాధవి తలను గోడకేసి కొట్టి కిందపడిపోయిన తర్వాత గొంతు నులిమి హతమార్చాడు. ఇంట్లో ఉన్న కత్తితో కాళ్లు, చేతులు, శరీరం, తల నాలుగు భాగాలుగా కట్ చేశాడు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ మృతదేహాన్ని ముక్కలు చేసినట్టు గుర్తించాం. వాటర్ హీటర్‌తో నీళ్లు మరిగించి శరీర భాగాలను ఉడక బెట్టాడు. ఆ తర్వాత వాటిని స్టవ్‌పై పెట్టి కాల్చాడు. రోకలి బండతో ఆ భాగాలను దంచి పొడి చేశాడు. ఆ పొడిని ప్లాస్టిక్ బకెట్‌లో తీసుకెళ్లి జిల్లెలగూడ చెరువులో పోశాడు. ఇంట్లో మొత్తం ఆనవాళ్లు లేకుండా చేసిన తర్వాత బంధువుల ఇంటికి వెళ్లి పిల్లల్ని తీసుకొచ్చాడు' 'అమ్మ ఏది' అని పిల్లలు అడిగితే ఎక్కడికో వెళ్లిందని చెప్పాడు. చంపినట్లు భౌతిక ఆధారాలు లేకుంటే.. కేసు నుంచి తప్పించుకోవచ్చని భావించాడు. పిల్లలు ఉంటే సాక్ష్యం చెబుతారనే అనుమానంతో వారిని బంధువుల ఇంటి వద్దే ఉంచాడు. రెండ్రోజుల తర్వాత మాధవి తల్లిదండ్రులు అడిగితే.. పోలీస్ స్టేషన్‌కు వచ్చి మిస్సింగ్ కేసు పెట్టారు. ఈ విషయాలన్నీ మాధవి మేనమామకు గురుమూర్తి చెప్పాడు. గురుమూర్తి చాలా క్రూరమైన స్వభావం కలిగిన వ్యక్తి. ఆర్మీలో 15 ఏళ్లు పనిచేశాడు. ఒక పథకం ప్రకారమే భార్యను హత్య చేశాడు. సాంకేతిక ఆధారాలు సేకరించాం అని వివరించారు. వెంకటమాధవి హత్య కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నాం. భార్యను కిరాతకంగా చంపడంపై గురుమూర్తిలో కొంచమైనా పశ్చాత్తాపం లేదు. హత్య కేసులో నిందితుడు ఉపయోగించిన స్టవ్, కత్తి, రోలర్, రోలర్ స్టోన్, బకెట్, వాటర్ హీటర్, రూమ్ ఫ్రెషనర్, యాసిడ్ బాటిల్, డోర్ మ్యాట్, స్క్రాప్ బకెట్, సర్ఫ్ ప్యాకెట్, బ్లాక్ కలర్ షర్ట్, మృతురాలి డ్రెస్, రెండు మొబైల్ ఫోన్లు సహా మొత్తం 16 వస్తువులను సీజ్ చేశాం' అని సీపీ సుధీర్‌బాబు తెలిపారు. ఈ క్రమంలో మీర్‌పేట హత్య కేసు నిందితుడు గురుమూర్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతడిని ఇంటికి తీసుకెళ్లి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేశారు. తన భార్య వెంకట మాధవిని

గురుమూర్తి కిరాతకంగా హత్య చేసి, మృతదేహాన్ని ముక్కలు, ముక్కలుగా చేసి కుక్కర్‌లో ఉడికించిన సంగతి తెలిసిందే. ఎముకలను కాల్చి బూడిద చేసి చెరువులో పడేశాడు. ఆ తర్వాత ఏమీ తెలియనట్లు ఆమె తల్లి సుబ్బమ్మతో కలిసి జనవరి 16న మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురుమూర్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తానే భార్యను హత్య చేశానని గురుమూర్తి అంగీకరించాడు. గురుమూర్తి చెప్పిన విషయాలపై ఆధారాలు సేకరించిన పోలీసులు తాజాగా అతడిని అరెస్టు చేశారు.

# ప్రతి శనివారం ఇక నో బ్యాగ్ డే

**విద్యార్థులకు భారం తగ్గించేలా చర్యలు**

**117 ఉపసంహరణపై క్షేత్రస్థాయిలో సమీక్ష**


**విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడి**

అమరావతి,జనవరి 28 : త్వరలో ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే' అమలు చేయబోతున్నట్లు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. దీనికి సంబంధించి విద్యార్థులకు యాక్టివిటీస్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యలో గత వైకాపా ప్రభుత్వం అనాలోచితంగా తీసుకువచ్చిన జీవో 117 ఉపసంహరణపై క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నుంచి అభిప్రాయ సేకరణ చేసిన తర్వాత అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని సూచించాలన్నారు. పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. త్వరలోనే చేపట్టబోయే ఉపాధ్యాయ బదిలీ చట్టంపై సమావేశంలో చర్చించారు. ఈ అంశంపై ఉపాధ్యాయులు, సంఘాల నుంచి అభిప్రాయాలను సేకరించాలని సూచించారు. సాంకేతికత సాయంతో ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులకు ఇప్పుడున్న అనేక యాప్‌ల స్థానంలో ఒకటే యాప్‌ను రూపొందించే ప్రక్రియను త్వరతిగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వాస్తవ సంఖ్యను నిర్ధరించేందుకు అపార్ ఐడీ అనుసంధానంపై ఆరా తీశారు. ఇంటర్మీడియట్ విద్యాశాఖలో చేపట్టబోయే సంస్కరణలపైనా సమావేశంలో చర్చించారు.

# ఢిల్లీ ఎన్నికల్లోనూ బాబు ప్రచారం

**ఫిబ్రవరి 1న తెలుగు ఏరియాల్లో పర్యటన**

**బిజెపి ఆహ్వానంతో ఢిల్లీకి వెళ్లనున్న చంద్రబాబు**



అమరావతి,జనవరి 28 : దేశ రాజధాని న్యూఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రచారం చేయనున్నారు. బీజేపీ అభ్యర్థుల తరపున ఆయన ఈ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 1వ తేదీన న్యూఢిల్లీలో తెలుగు వారు అత్యధికంగా నివసించే ప్రాంతాల్లో బీజేపీ అభ్యర్థులను మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారం చేయనున్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలంటూ సీఎం చంద్రబాబు నాయుడును బీజేపీ అగ్రనాయకత్వం ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 5వ తేదీన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 8వ తేదీన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. దీంతో దేశ రాజధాని ఓటరు ఏ పార్టీకి పట్టం కట్టాడనేది ఆ రోజు మధ్యాహ్నానానికి తెలియనుంది. మరోవైపు గతేడాది మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో సైతం సీఎం చంద్రబాబు నాయుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వేర్వేరుగా ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మహారాష్ట్రలోని మహాయుతి కూటమి ఘన విజయం సాధించింది. దీంతో బీజేపీ సీనియర్ నేత, మాజీ సీఎం దేవేంద్ర ఫడణవీస్ మరోసారి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అలాగే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో సైతం సీఎం చంద్రబాబుతో ప్రచారం నిర్వహించాలని భావించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలంటూ ఆయనను కోరింది. అదీకాక.. ఎన్డీయే కూటమిలో టీడీపీ, జనసేన పార్టీలు భాగస్వామ్య పార్టీలుగా ఉన్నాయి. దీంతో దేశ రాజధాని న్యూఢిల్లో తెలుగు ప్రజలు నివసిస్తున్న ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటికే పలుమార్లు ఆమ్ ఆద్మీ పార్టీ వరుసగా గెలుపొందింది. దీంతో ఆ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్.. ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారు. అయితే గతేడాది ఢిల్లీ మద్యం కుంభకోణం మనీ లాండరింగ్ వ్యవహారంలో ఆయనను ఈడీ అరెస్ట్ చేసింది. దీంతో ఆయనను తీహాడ్ జైలుకు తరలించారు. దాదాపు కొన్ని నెలల పాటు ఆయన జైల్లో ఉన్నారు. ఆయనకు షరతులతో కూడిన బెయిల్ కోర్టు మంజూరు చేసింది. ఈంతో బయటకు వచ్చిన కేజ్రీవాల్.. తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆ క్రమంలో పార్టీలోని సీనియర్ నేత, మంత్రి అతిషిని ముఖ్యమంత్రిగా ఎంపిక చేశారు. అయితే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు వేసే ఓటు ద్వారా తన నిర్దోషత్వాన్ని నిరూపించుకొని.. మళ్లీ సీఎం పీఠాన్ని అధిష్టాస్తానంటూ కేజ్రీవాల్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

# షరియా పట్ల నాకు విశ్వాసం లేదు

**భారతీయ వారసత్వ చట్టమే వర్తింప చేయండి**

**సుప్రీంలో కేరల ముస్లిం మహిళ పిటిషన్**

న్యూఢిల్లీ,జనవరి 28 : షరియాకు బదులు భారతీయ వారసత్వ చట్టమే తనకు వర్తించాలని అభ్యర్థిసూ ఒక ముస్లిం మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్రం వైఖరి ఏమిటని సుప్రీం కోర్టు మంగళవారం అడిగింది. 'కేరళ పూర్వపు ముస్లింలు' సంస్థ ప్రధాన కార్యదర్శి, అళప్పుళ వాసి సఫియా పిఎం పిటిషన్ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తులు సంజయ్ కుమార్, కెవి విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చింది. కేంద్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సొలిసిటర్ జనరల్ (ఎస్‌జి) తుషార్ మెహతా ఈ పిటిషన్ ఒక ఆసక్తిదాయక ప్రశ్నను లేవనెత్తిందని అన్నారు. 'పిటిషనర్ మహిళ జన్మతః ముస్లిం. తనకు షరియాలో విశ్వాసం లేదని ఆమె చెబుతోంది, అది ఒక తిరోగమన చట్టం అని ఆమె భావిస్తోంది' అని మెహతాపేర్కొన్నారు. 'ఇది మత విశ్వాసాల వ్యాప్తంగా వర్తిస్తుంది. మీరు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయవలసి ఉంటుంది' బెంచ్ సూచించింది. ఆదేశాలు తీసుకుని, కౌంటర్ అఫిడవిట్ దాఖలుకు మూడు వారాలు కావాలని మెహతా కోరారు. బెంచ్ నాలుగు వారాలు మంజూరు చేసి, ఈ విషయాన్ని మే 5న మొదలయ్యే వారంలో వింటామని తెలియజేసింది. ఈ పిటిషన్‌పై కేంద్రం, కేరళ ప్రభుత్వ స్పందనలను సర్వోన్నత న్యాయస్థానం నిరుడు ఏప్రిల్ 29న కోరింది. తాను అధికారికంగా ఇస్లాంను వదిలిపెట్టకపోయినప్పటికీ తాను విశ్వాసపరురాలిని కానని, అధికరణం 25 కింద తన మత ప్రాథమిక హక్కు అమలును కోరుకుంటున్నానని తెలిపిన పిటిషనర్ దానిలో 'విశ్వసించని హక్కు'ను కూడా చేర్చాలని అన్నారు. ముస్లిం పర్సనల్ లా తమకు వర్తించకూడదని ఆకాంక్షిస్తున్న వ్యక్తులను మరణ శాసనంలేని, నిబంధన వారసత్వం విషయాల్లో 'దేశం సెక్యులర్ చట్టం' భారతీయ వారసత్వ చట్టం 1925ను వర్తించేలా అనుమతించేలా ఒక డిక్లరేషన్‌ను జారీ చేయాలని కూడా ఆమె కోరారు. షరియా చట్టాల కింద ఆస్తిలో మూడింట ఒక వంతు వాటాకు ముస్లిం మహిళలు అర్హులని న్యాయవాది ప్రశాంత్ పద్మనాభన్ ద్వారా దాఖలైన సఫియా పిటిషన్ స్పష్టం చేసింది. పిటిషనర్‌కు ముస్లిం పర్సనల్ లా వర్తించదనే డిక్లరేషన్ కోర్టు నుంచి రావలసి ఉంటుందని, లేనిచో ఆమె తండ్రి ఆస్తిలో మూడింట ఒక వంతు ఇవ్వలేకపోవచ్చునని న్యాయవాది సూచించారు.



ముస్లింలను మినహాయించినందుకు భారతీయ వారసత్వ చట్టాన్ని, ఇతర నిబంధనలను సవాల్ చేసేందుకు తగు విధంగా పిటిషన్‌ను సవరించేందుకు సఫియాను సర్వోన్నత న్యాయస్థానం అనుమతించింది. దేశవ్యాప్తంగా విస్తృత స్థాయిలో విపరిణామాలు సంభవించవచ్చునని సూచిస్తూ పిటిషన్ జోక్యం చేసుకోవలసిందిగా బెంచ్‌కు విజ్ఞప్తి చేసింది. సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసు ముస్లిం మహిళలు అందరి కోసం అని, కాని ప్రస్తుత పిటిషన్ ముస్లింగా జన్మించి మతాన్ని వీడాలని ఆకాంక్షించే వారి కోసమని పిటిషన్ పేర్కొన్నది.

# అవినీతి రహిత పాలన పేరుతో బురిడీ

**కేజ్రీవాల్ అద్దాల మేడలో నివాసం**

**ఎన్నికల ప్రచారంలో విరుచుకుపడ్డ రాహుల్**



న్యూఢిల్లీ,జనవరి 28 : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో దిల్లీలోని ప్రధాన పార్టీల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. అధికారంలోని ఆమ్ ఆద్మీ పార్టీపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు గుప్పించారు. అవినీతిరహిత పాలన పేరుతో బురిడీ కొట్టించారని, కేజ్రీవాల్ అద్దాల మేడలో నివాసం ఉంటున్నారని, ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో రాహుల్ విరుచుకుపడ్డారు. రాహుల్'కేజ్రీవాల్ తనకు తోచిన విషయాన్ని మాట్లాడుతూ ఉంటారు. మొదట్లో దిల్లీలో అవినీతి రహిత రాజకీయాలు చేస్తానని చెప్పారు. దేశ రాజధానిలో మార్పులు చూపిస్తానని అన్నారు. కానీ, పేదలు కష్టాల్లో ఉన్నప్పుడు మాత్రం కనిపించకుండా పోతారు. దిల్లీలో హింస జరిగే సమయంలో మాయం అయ్యారు. ఆయనకు కొత్తలో చిన్న కారు మాత్రమే ఉండేది. కానీ, తర్వాత శీష్ మహల్‌లో (అద్దాల మేడ) నివసించారు' అంటూ దిల్లీలో ఏర్పాటు చేసిన ఎన్నికల బహిరంగ సభలో పాల్గొన్న రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. 'అవినీతి రహిత రాజకీయాలు చేస్తానని చెప్పి.. దిల్లీలో భారీ కుంభకోణమే చేశారు. కుంభకోణానికి కేజ్రీవాల్ రూపకల్పన చేశారు. కాబట్టి వాస్తవం బయటకి వచ్చింది. ఆప్ నేత మనీశ్ సిసోదియా జైలు జీవితం గడిపారు. ప్రస్తుతం తమ పదవుల నుంచి తప్పుకున్నారు. పదవిలో ఉన్నప్పుడు ఆయన నివసించిన శీష్ మహల్‌ను మీరూ చూశారు. కేజ్రీవాల్ అత్యంత విలాసవంతమైన అద్దాల మేడలో నివాసం ఉన్నారు. ఇప్పుడు నిజాలు బయటపడ్డాయి. వారి రాజకీయాలు అందరికీ అర్థమయ్యాయి' అని అన్నారు. దిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. అధికారంలోని ఆప్‌ను గద్దె దింపేందుకు ప్రతిపక్షాలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కొంతకాలంగా 'సీఎం బంగ్లా' వివాదం రాజకీయ దుమారం రేపుతోంది. ఈ బంగ్లాను 'శీష్ మహల్ (అద్దాల మేడ) అంటూ భాజపా విమర్శిస్తోంది. ఈ క్రమంలోనే శీష్ మహల్ గురించి ప్రస్తావిస్తూ రాహుల్ ఆప్‌పై తీవ్ర విమర్శలు చేశారు. కాగా.. దిల్లీలో ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనుండగా.. 8న ఫలితాలు వెలువడనున్నాయి.

# అవును...యమునా పూర్తిగా విషపూరితమే

**ఆ నీళ్లను ఢిల్లీ వాసులు తాగకుండా చూస్తా**

**వ్యాఖ్యలను సమర్థించుకున్న ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్**



న్యూఢిల్లీ, జనవరి 28 : హర్యానాలో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం యమునా నదిలో 'విషం' కలిపిందని ఆరోపించిన మరునాడు మంగళవారం ఆప్ అధినేత అర్వింద్ కేజ్రీవాల్ చట్టపరమైన చర్యకు తాను భయపడబోనని స్పష్టం చేశారు. 'మురికి, విషపూరిత నీరు' కారణంగా ఢిల్లీ వాసులను తాను చావనివ్వబోనని కేజ్రీవాల్ ప్రకటించారు. పొరుగు రాష్ట్రం నుంచి సరఫరా చేస్తున్న నీటిలో అమ్మోనియా అనే 'విషాన్ని' కలిపినట్లు ఢిల్లీ జల్ బోర్డ్ (డిజెబి) సిఇఒ సోమవారం ఒక లేఖలో ధ్రువీకరించినట్లు కేజ్రీవాల్ విలేకరుల గోష్ఠిలో తెలియజేశారు. కేజ్రీవాల్ ఆరోపణను హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ ఖండించారు. కేజ్రీవాల్ కనుక క్షమాపణ చెప్పని పక్షంలో ఆయనపై పరువునష్టం దావా వేస్తామని సైనీ బెదరించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఈ విషయమై ఎన్నికల కమిషన్ (ఇసి) అధికారులతో భేటీ అవుతారని కేజ్రీవాల్ తెలిపారు. సైనీపై కేజ్రీవాల్ విరుచుకుపడుతూ, హర్యానా ముఖ్యమంత్రి ఈ విషయమై రాజకీయాలు చేయరాదని అన్నారు. 'ఇది పాపం. మీరు ప్రజల శాపానికి గురవుతారు' అని కేజ్రీవాల్ అన్నారు. 'నాపై కేసు వేస్తామని వారు బెదరిస్తున్నారు. వారు నన్ను జైలుకు పంపారు, వారు ఇప్పుడు నన్ను ఉరి తీస్తారా?' అని ఆయన అన్నారు. బిజెపి 'మురికి రాజకీయాలు' చేయకూడదని ఆయన కోరారు. యమునలో పరిశుద్ధ నీటిని విడుదల చేయాలని హర్యానా ముఖ్యమంత్రికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఇది ఇలా ఉండగా, డిజెబి సిఇఒ శిల్పా షిండే ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ధర్మేంద్రకు సోమవారం రాసిన ఒక లేఖలో కేజ్రీవాల్ ఆరోపణను తోసిపుచ్చారు. ఆయన ఆరోపణ 'పూర్తిగా అసత్యం, నిరాధారమైనది, తప్పుదారి పట్టించేది' అని ఆమె స్పష్టం చేశారు. డిజెబి క్రమం తప్పకుండా నీటి నాణ్యతను పరీక్షించిందని, తదనుగుణంగా ప్రక్షాళన ప్రక్రియను సరి చేసిందని ఆమె వివరించారు. తగ్గిన నీటి ప్రవాహం, ప్రక్షాళన చేయని మురుగునీరు లేదా పారిశ్రామిక వ్యర్థ జలాలు కలవడం వల్ల శీతాకాలాల్లో యమునలో సహజంగానే అమ్మోనియా స్థాయిలో పెరిగాయని కూడా శిల్పా షిండే తెలిపారు.

# ఫార్ములాను అడ్డుకున్న సిఎం రేవంత్

**పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

హైదరాబాద్,జనవరి 28 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బిఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ఫోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫార్ములా ఈ కేసు వ్యవహారంలో సీఎంపై కేసు నమోదు చేయాలని నార్సింగి పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఆర్ఎస్‌పి ఫిర్యాదు చేశారు. ఆయన వెంట పలువురు బిఆర్ఎష్ నేతలు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేను రాజకీయాల్లో రాకముందు ఐపీఎస్ అధికారిగా, క్రైమ్ బ్రాంచ్ డీసీపీగా, అడిషనల్ డీజీపీగా, వార్ క్రైమ్స్ ఇన్వెస్టిగేటింగ్ అధికారిగా ఐక్యరాజ్యసమితిలో పనిచేశా. రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్ల లేని అవినీతిని పేపర్ మీద పెట్టి అనవసరంగా తెలంగాణకు నష్టం చేస్తున్నాడు అని మండిపడ్డారు. కాగా, ఫార్ములా ఈ రేసు కేసులో మాజీ మంత్రి కెటిఆర్.. చట్ట విరుద్ధంగా, ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ కంపెనీకి దాదాపు రూ.53 కోట్లు ట్రాన్స్ ఫర్ చేసినట్లు గుర్తించిన ఏసీబీ ఆయనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
29 జనవరి
2025





## ఇంగ్లాండ్‌తో మూడో టీ20లో..

# టీమ్‌ఇండియా ఓటమి





**రాజ్‌కోట్:** వరుసగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచి జోరు మీదున్న టీమ్‌ఇండియాకు ఇంగ్లాండ్ కళ్లెం వేసింది. రాజ్‌కోట్ వేదికగా జరిగిన మూడో మ్యాచ్‌లో టీమ్‌ఇండియాపై ఇంగ్లాండ్ 26 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో పర్యటక జట్టు సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. 172 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన టీమ్‌ఇండియా 9 వికెట్లు కోల్పోయి 145 పరుగులకే పరిమితమైంది. భారత బ్యాటర్లలో హార్దిక్ పాండ్య (40బీ 35 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) ఒక్కడే చెప్పుకోదగ్గ స్కోరు చేశాడు. అభిషేక్ శర్మ (24), సూర్యకుమార్ యాదవ్ (14), అక్షర్ పటేల్ (15) పెద్దగా రాణించలేదు. గత మ్యాచ్ సెంచరీ హీరో తిలక్ వర్మ (18) ఈ సారి ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. సంజు శాంసన్ (3), వాషింగ్టన్ సుందర్ (6), ధ్రువ్ జురెల్ (2) సింగిల్ డిజిట్ స్కోరుకే వెనుదిరిగారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జేమీ ఒవర్టన్ 3 వికెట్లు పడగొట్టగా.. జోఫ్రా ఆర్చర్, బ్రైడన్ కార్సే చెరో 2 వికెట్లు పడగొట్టారు. రషీద్, మార్క్‌వుడ్ తలో వికెట్ తీశారు. ఈ సిరీస్‌లో ప్రస్తుతం భారత్ 2-1తో ఆధిక్యంలో ఉంది. నాలుగో టీ20 శుక్రవారం (జనవరి 31) పుణె వేదికగా జరగనుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. ఓపెనర్ బెన్ డకెట్ (51బీ 28 బంతుల్లో ) అర్ధ శతకం చేయగా.. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ లివింగ్‌స్టన్ (43బీ 24 బంతుల్లో) దూకుడుగా ఆడాడు. జోస్ బట్లర్ (24) పరుగులు చేశాడు. టెయిలెండర్లు ఆదిల్ రషీద్ (10), మార్క్ వుడ్ (10) కీలక పరుగులు రాబట్టారు. భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (5/24) ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. రవి బిష్ణోయ్ 4 ఓవర్లలో ఒక వికెట్ పడగొట్టి 46 పరుగులు సమర్పించుకున్నాడు. హార్దిక్ పాండ్య 2, అక్షర్ పటేల్ ఒక వికెట్ పడగొట్టారు.



## త్రిష ఆల్ రౌండ్ ప్రదర్శన..

### స్కాట్లాండ్‌పై భారత్ ఘన విజయం

**కౌలాలంపూర్:** అండర్-19 మహిళల వరల్డ్ కప్‌లో భారత అమ్మాయిలకు ఎదురులేకుండా పోయింది. సూపర్ సిక్స్‌లో భాగంగా రెండో మ్యాచ్‌లోనూ ఘన విజయం సాధించంది. తెలుగు క్రికెటర్ గొంగడి త్రిష ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. మొదట బ్యాటింగ్‌లో సెంచరీ చేసిన త్రిష.. బౌలింగ్‌లోనూ కీలకమైన మూడు వికెట్లు పడగొట్టింది. దీంతో స్కాట్లాండ్‌ను భారత్ 150 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో వికెట్ నష్టానికి 208 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో స్కాట్లాండ్ 14 ఓవర్లలో 58 పరుగులకే కుప్పకూలిపోయింది. ఓపెనర్లు పిప్పా (12), వాల్‌సింగమ్ (12), పిప్పా స్ప్రోల్ (11) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. భారత్ బౌలర్లలో శుక్ల 4 వికెట్లు పడగొట్టగా, వైష్ణవి శర్మ, త్రిష చెరో 3 వికెట్లు తీశారు. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన త్రిషకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వచ్చింది. వరల్డ్ కప్‌లో ఇప్పటికే భారత్ సెమీస్ చేరిన సంగతి తెలిసిందే. జనవరి 31న సెమీ ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

#### అదరగొట్టిన త్రిష

తెలుగు యువ క్రికెటర్ గొంగడి త్రిష (110లి: 59 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్స్‌లు) రికార్డు సెంచరీ బాదింది. కేవలం 53 బంతుల్లోనే శతకం చేసింది. దీంతో అండర్-19 టీ20ల్లో తొలి సెంచరీ నమోదు చేసిన బ్యాటర్‌గా రికార్డు సృష్టించింది. ఈ టోర్నీలో ప్రతి మ్యాచ్‌లోనూ త్రిష నాణ్యమైన ఆటతీరుతో అభిమానులను అలరిస్తోంది. ఇప్పటికే సెమీస్‌కు చేరుకున్న భారత్.. సూపర్ సిక్స్‌లో తన చివరి మ్యాచ్‌లోనూ భారీ స్కోరు చేసింది. ఇది కూడా అండర్ 19 టీ20ల్లో రికార్డే. ఓపెనర్లు త్రిష - కమలిని కలిసి తొలి వికెట్‌కు 147 పరుగులు జోడించారు. హాఫ్ సెంచరీ తర్వాత కమలిని ఔటైనా.. భారత ఇన్నింగ్స్ మాత్రం ఆగలేదు. సానికాతో కలిసి చివరి వరకూ క్రీజ్‌లో ఉన్న త్రిష రెండో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యం నిర్మించింది. ఈ క్రమంలో అండర్ 19 వరల్డ్ కప్‌లో సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా ఘనత సాధించింది.



## నో లైవ్ కవరేజీ... విరాట్ కోహ్లీ

### ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్!

దాదాపు 13 ఏళ్ల తర్వాత విరాట్ కోహ్లీ రంజీల్లోకి అడుగుపెట్టబోతున్నాడన్న వార్తలు వచ్చాయి. దిల్లీ తరఫున జనవరి 30 నుంచి రైల్వేస్‌తో జరగబోయే మ్యాచ్‌లో ఆడనున్నాడు. ఇప్పటికే కోహ్లీ పేరును దిల్లీ జట్టులో చేర్చిన సంగతి తెలిసిందే. ఆయుష్ బదోని నాయకత్వంలో దిల్లీ జట్టు బరిలోకి దిగనుంది. చివరిసారిగా 2012లో ఉత్తర్‌ప్రదేశ్‌పై రంజీ మ్యాచ్ ఆడాడు. అయితే, ఇప్పుడు దేశవాళీ క్రికెట్‌లో ప్రతిఒక్కరూ ఆడాలనే బీసీసీఐ నిబంధనల నేపథ్యంలో ఇప్పటికే రోహిత్, యశస్వి, రిషభ్ పంత్, గిల్ ఆడారు. ఇప్పుడు విరాట్ కోహ్లీ కూడా ఇదే బాటలోకి వచ్చాడు. దిల్లీ కెప్టెన్సీ బాధ్యతలను కోహ్లీ తిరస్కరించాడని సమాచారం. అయితే, అతడి ఆటను మరోసారి చూద్దామనే అభిమానులకు షాక్ తగలనుంది. రోహిత్ ప్రాతినిధ్యం వహించిన ముంబయి మ్యాచ్‌ను బీసీసీఐ లైవ్ కవరేజీ ఇచ్చింది. కేవలం ఓటీటీకే పరిమితమైంది. ఇప్పుడు దిల్లీ మ్యాచ్‌కు మాత్రం అలాంటి అవకాశం ఉండొకపోవచ్చని సమాచారం. ఈవిషయంపై దిల్లీ క్రికెట్ సంఘం స్పందించింది. “బీసీసీఐ ఏమైనా చివరి నిమిషంలో లైవ్ కవరేజీకి ఏర్పాట్లు చేస్తుందేమో తెలియదు. ఇప్పటివరకైతే మాకు ఎలాంటి సమాచారం లేదు. సాధారణంగా పెద్ద మ్యాచ్‌లకు లైవ్ టెలీకాస్ట్ లేదా ఓటీటీ స్ట్రీమింగ్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. గతంలో తమిళనాడుతో మ్యాచ్‌ను లైవ్ ఇచ్చిన సందర్భం ఉంది. బ్రాడ్‌కాస్ట్‌ను రోస్టర్ పద్ధతిలో చేసేందుకు ముందుగానే నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది” అని దిల్లీ క్రికెట్ సంఘం అధికారులు వెల్లడించారు. మరో రెండు రోజుల్లోనే మ్యాచ్ ప్రారంభం కానున్నవేళ.. లైవ్ ఇవ్వడానికి అవసరమైన సిస్టమ్‌ను ఏర్పాటుచేయాలంటే కాస్త సవాల్‌తో కూడుకున్న వ్యవహారమే. మల్టీ కెమెరా సెటప్‌ను సిద్ధం చేయాల్సిఉంటుంది.

## ఒలింపిక్స్ నిర్వహణతో.. భారత క్రీడలు ఉన్నత శిఖరాలకు : మోదీ



భారత్‌లో 2036 ఒలింపిక్స్ నిర్వహిణ హక్కులను దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. విశ్వక్రీడల నిర్వహణ భారతీయ క్రీడలను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుందన్నారు. దేహ్రాదూన్‌లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడలను ప్రారంభించిన ఆయన.. ఒలింపిక్స్ వల్ల అనేక రంగాల్లో విస్తృత అవకాశాలు వస్తాయన్నారు. “ఒలింపిక్స్ 2036 నిర్వహణ హక్కుల కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. కేవలం ఇవి క్రీడలకే పరిమితం కాదు.. ఇవి జరిగిన చోట అన్ని రంగాలు లాభపడతాయి. క్రీడాకారులతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది భారత్‌కు వస్తారు. ఇక్కడి క్రీడాకారులకు అనేక వసతులు అందుబాటులోకి వస్తాయి. నిర్మాణ రంగానికి ఊతమిస్తుంది. రవాణా వసతులు, ముఖ్యంగా పర్యాటకం మెరుగుపడుతుంది” అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఉమ్మడి పౌరస్మృతి బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యూసీసీని అమలు చేస్తున్న ఉత్తరాఖండ్‌ను అభినందించిన ఆయన.. ఈ చట్టాన్ని సెక్యులర్ సివిల్ కోడ్‌గా అభివర్ణించారు. క్రీడల మాదిరిగానే యూసీసీ కూడా జట్టు స్ఫూర్తితో కూడుకున్నదని, ఎవరిపైనా వివక్ష లేదన్నారు.

# మీ మనసు అక్కడ లేదు..

### రోహిత్-శ్రేయస్ అందుకోసమే ఆడారా? : గావస్కర్ ఆగ్రహం



దేశవాళీలో ప్రతిఒక్కరూ ఆడాలి.. ఇదీ భారత స్టార్లకు బీసీసీఐ పెట్టిన షరతు. అందుకు తగినట్టుగానే కెప్టెన్ రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, రిషభ్ పంత్, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ తదితరులు ఆడేశారు. ఇప్పుడు విరాట్ కోహ్లీ కూడా సిద్ధమయ్యాడు. రోహిత్, శ్రేయస్, యశస్వి ముంబయి జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. కానీ, ముగ్గురు ఘోరంగా విఫలమయ్యారు. దీంతో జమ్ముకశ్మీర్ చేతిలో ముంబయికి ఓటమి తప్పలేదు. ఈ క్రమంలో భారత స్టార్లపై క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ తీవ్ర అసహనం వ్యక్తంచేశాడు. బౌలింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై ఎటాకింగ్ చేయాలనే రోహిత్, శ్రేయస్ ఆలోచనపై గావస్కర్ విమర్శలు గుప్పించాడు. శార్దూల్ ఠాకూర్, తనుష్ కొటియన్‌ను చూసి నేర్చుకోవాలని హితవు పలికాడు. జాతీయ జట్టులోకి రావాలని భావిస్తోన్న తనుష్‌పై సెలక్టర్లు దృష్టిసారించాలని సూచించాడు. “ముంబయి జట్టులోని టెస్టు బ్యాటర్లు ఔటైన తీరు మరోసారి చర్చకు వచ్చింది. ప్రస్తుత రోజుల్లో దూకుడైన ఆటతీరుతో సుదీర్ఘ ఫార్మాట్ ప్రమాదంలో పడేలా ఉంది. అయితే, ఫ్లాట్ పిచ్‌పై వేగంగా ఆడితే ప్రయోజనం ఉంటుంది. బంతికి సహకారం లభిస్తోన్న పిచ్‌పై టెక్నిక్ బాగుండాలి. మంచి డెలివరీని గౌరవించాలి. అలాకాకుండా ప్రతీ బంతిని కొడదామనే ఉద్దేశంతో ఉంటే గత టెస్టు సిరీస్‌లోలాగే పరాభవం ఎదురుకానుంది. కాస్త ఇంగిత జ్ఞానం, ఓర్పు ప్రదర్శించాలి. జమ్మూకశ్మీర్‌తో మ్యాచ్‌లో ముంబయి కనీసం మరో 50 పరుగులు చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేది. సిల్లీ షాట్లతో వికెట్లను సమర్పించడం ఇకనైనా ఆపేయాలి. రంజీ మ్యాచ్‌లో భారత స్టార్ల ఆటను చూస్తుంటే మరో అనుమానం కలుగుతోంది. వారి మనసు ఇక్కడ లేదేమో అనిపిస్తోంది. బీసీసీఐ కాంట్రాక్ట్‌ల నుంచి బయటకు వెళ్లిపోకుండా ఉండేందుకు ఆడినట్లు ఉంది. గతేడాది దేశవాళీలో ఆడకుండా ఇషాన్, శ్రేయస్ బీసీసీఐ ఆగ్రహానికి గురయ్యారు. వారికి సెంట్రల్ కాంట్రాక్ట్‌లు పోయాయి. ఇప్పుడు రోహిత్, యశస్వి కూడా కాంట్రాక్ట్‌లు కోల్పోకుండా ఉండేందుకు ఆడినట్లు ఉంది. రోహిత్ కోసం సెంచరీలు కొట్టిన ఆయుష్ మాత్రేను బెంచ్‌కే పరిమితం చేయాల్సివచ్చింది. అయితే, సీనియర్ ప్లేయర్లతో కలిసి డ్రెస్సింగ్ రూమ్‌ను షేర్ చేసుకున్న కుర్రాడు ఆయుష్ దానిని సద్వినియోగం చేసుకుంటాడని అనుకుంటున్నా. అతడి బ్యాటింగ్‌కు అదనపు నైపుణ్యాలు అందిపుచ్చుకోవడానికి ఇదొక మంచి అవకాశం. లోయర్ ఆర్డర్‌లో వచ్చిన తనుష్ కొటియన్ చక్కటి ఆటతీరు ప్రదర్శించాడు. భారత సీనియర్ క్రికెటర్ శార్దూల్ ఠాకూర్ బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి జట్టును కాపాడేందుకు ప్రయత్నించాడు. బీసీసీఐ సెలక్టర్లు వీరిపైనా ఓ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది” అని గావస్కర్ వెల్లడించాడు.

#### ఆసక్తిగా ఎదురుచూస్తున్నా..

“జనవరి 30 నుంచి రంజీ ట్రోఫీ చివరి రౌండ్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. కేఎల్ రాహుల్, మహ్మద్ సిరాజ్, విరాట్ కోహ్లీ తదితరులు బరిలోకి దిగబోతున్నారు. వారి ఆటను చూసేందుకు ఆసక్తిగా ఉన్నా. దేశవాళీలో వారు ఆడి చాలా రోజులు అవుతోంది. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు మళ్లీ ఫామ్ అందుకోవడానికి ఈ మ్యాచ్‌లను ఉపయోగించుకోవాలి” అని సునీల్ గావస్కర్ సూచించాడు.



# తొలిసారి సీనియర్ హీరోతో మాళవిక

సోషల్ మీడియాలో ఎప్పటికపుడు కొత్త కొత్తగా ట్రెండీ లుక్‌లో మెరిసిపోతూ అభిమానులు, ఫాలోవర్లకు నిద్రపట్టకుండా చేస్తుంది మలబారు సోయగం మాళవిక మోహనన్. ఈ బ్యూటీ ప్రస్తుతం గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్‌తో కలిసి రాజాసాబ్ సినిమాలో నటిస్తుందని తెలిసిందే. తొలిసారి తెలుగులో నటిస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి. తాజాగా ఈ భామకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింటిని షేక్ చేస్తోంది. ఈ బ్యూటీ కెరీర్‌లో తొలిసారి ఓ సీనియర్ హీరోతో రొమాన్స్ చేసేందుకు రెడీ అయింది. మాళవిక మోహనన్ మాలీవుడ్ స్టార్ యాక్టర్ మోహన్‌లాల్ హృదయపూర్వంలో హీరోయిన్‌గా ఫైనల్ అయిందని ఇండస్ట్రీ సర్కిల్ సమాచారం. మాళవిక మోహనన్ ఓ సీనియర్ హీరోతో రొమాన్స్ చేయడం ఇదే తొలిసారి కావడంతో సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఫ్యామిలీ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రాన్ని సత్యన్ అంథిక్కడ్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీలో సంగీత, సిద్దిఖీ, సంగీత్ ప్రతాప్, నిషాన్, లలు అలెక్స్, జనార్ధనన్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 10 నుంచి సెట్స్‌పైకి వెళ్లనుంది.



# స్టార్ హీరోతో పూజాహెగ్డె లిప్‌లాక్

స్టార్ హీరోయిన్ పూజా హెగ్డేకు ప్రస్తుతం బ్యాడ్ లక్ నడుస్తుంది. ఈ అమ్మడు చేసిన సినిమాలని వరుసగా డిజాస్టర్ గా నిలిచాయి. సినిమాలు ఫ్లాప్ అయ్యాయి కానీ పూజా క్రేజ్ మాత్రం అక్కడా తగ్గలేదు. తెలుగులో తక్కువ సమయంలోనే తోపు హీరోయిన్ గా మారింది ఈ పొడుగుకాళ్ల సుందరి. నాగ చైతన్య ఒక లైలా కోసం సినిమాతో మొదలు పెట్టి చివరిగా వచ్చిన రాదే శ్యామ్ సినిమా వరకు ఈ అమ్మడు తన నటనతో అందంతో కవ్వించింది. కాగా ఈ అమ్మడు తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో సినిమాలు చేసి మెప్పించింది. అయితే గతకొంతకాలంగా ఈ అమ్మడికి కాలం కలిసి రావడం లేదు. చేసిన సినిమాలన్నీ దారుణంగా నిరాశపరిచాయి. ఒక్క భాషలో కాదు ఆమె నటించిన అన్ని బాషల సినిమాలు డిజాస్టర్ అయ్యాయి. దాంతో ఈ అమ్మడికి అవకాశాలు తగ్గాయి. ఇప్పుడు యంగ్ బ్యూటీస్ క్రేజీ ఆఫర్స్ అందుకుంటున్నారు. దాంతో ఇప్పుడు పూజా కూడా స్పీడ్ పెంచాలని నిర్ణయించుకుంది. ఇప్పటికే తమిళ్ లో ఓ సినిమా హిందీలో ఓ సినిమాను లైనప్ చేసింది. అంతేకాదు ఈసారి డోస్ పెంచి తన అందంతో ప్రేక్షకులను కట్టిపడేయడానికి రెడీ అవుతుంది. ఇప్పటికే ఈ అమ్మడు తన గ్లామర్ తో కుర్రాళ్లకు నిద్రపట్టకుండా చేస్తుంది. కాగా ఇప్పుడు ఓ రొమాంటిక్ సినిమాలో రెచ్చిపోయిందని తెలుస్తుంది. పూజగా తమిళ్ లో దళపతి విజయ్ సరసన ఓ సినిమా చేస్తుంది. అలాగే హిందీలో షాహిద్ కపూర్ తో కలిసి ఓ సినిమా చేస్తుంది. దేవా అనే టైటిల్ తో వస్తున్న ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ సినిమాలో పూజా రొమాంటిక్స్ సీన్స్ లో రెచ్చిపోయి నటించిందని తెలుస్తుంది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు సర్టిఫికేట్ ఇచ్చింది. సినిమాలో రొమాంటిక్ సీన్స్, బోల్డ్ డైలాగ్స్, అసభ్యకరమైన సన్నివేశాలు ఉండటం పై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసిందని తెలుస్తుంది. ఇక ఈ సినిమాలో లిప్ లాక్స్ కు కొదవే లేదు అని తెలుస్తుంది. సినిమాలో మొత్తంగా ఆరు లిప్ లాక్స్ ఉంటాయని తెలుస్తుంది. అంతే కాదు షాహిద్ కపూర్- పూజాహెగ్డే మధ్య ఈ లిప్ లాక్ సీన్ ఓ రేంజ్ లో ఉండటంతో ఆ సీన్ ను సెన్సార్ బోర్డు తొలగించాలని సూచిందని తెలుస్తుంది. మొత్తానికి పూజా రొమాంటిక్ సీన్స్ లో రెచ్చిపోయి నటించిందట. మరి ఈ సినిమా పూజకు ఎలాంటి హిట్ ఇస్తుందో చూడాలి.



# ఆ నిర్మాత మాటలకు ఇబ్బందిపడ్డాను

*క్యాస్టింగ్ కౌచ్‌పై 'దంగల్' నటి*

అగ్ర నటుడు ఆమిర్ ఖాన్ 'దంగల్' సినిమాతో కెరీర్ ఆరంభించారు ఫాతిమా సనా షేక్. ఇందులోని ఆమె పాత్రకు విశేష ఆదరణ లభించింది. తెలుగులో 'నువ్వు నేను ఒక్కటవుదాం' అనే చిత్రంలోనూ నటించి మెప్పించారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కెరీర్ ప్రారంభంలోనే క్యాస్టింగ్ కౌచ్‌ను ఎదుర్కొన్నట్లు చెప్పారు. హైదరాబాద్ వచ్చినప్పుడు ఓ నిర్మాత మాటలకు తాను ఇబ్బందిపడినట్లు తెలిపారు. "బాలీవుడ్‌లో అడుగుపెట్టడానికి ముందు సౌత్ ఇండస్ట్రీలో ఓ అవకాశం వచ్చింది. అది నా కెరీర్‌ను మలుపు తిప్పుతుందని భావించా. హైదరాబాద్‌లో ఆ చిత్ర నిర్మాతను కలిసినప్పుడు ఆయన నాతో అనుచితంగా ప్రవర్తించారు. 'మీకు అవకాశం కావాలంటే ప్రతి పనిని చేయడానికి సిద్ధంగా ఉండాలి. ఏది చేయడానికైనా అంగీకరించాలి' అన్నారు. సినిమాకు ఏం అవసరమైనా నేను చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పాను. ఆ నిర్మాత క్యాస్టింగ్ కౌచ్ గురించి చాలా ఓపెన్‌గా మాట్లాడారు. దీంతో ఇబ్బందిపడి మౌనంగా వచ్చేశాను" అని తెలిపారు. ఇండస్ట్రీలో కొత్త వారికి అవకాశం రావడం చాలా కష్టమని ఫాతిమా సనా షేక్ అన్నారు. ఒకవేళ ఎంతో కష్టపడి అవకాశం అందుకున్నా రిఫరెన్స్ పేరుతో నిర్మాతలే 15 శాతం పారితోషికాన్ని తీసుకుంటారని చెప్పారు.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986